తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు

**-రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా**




మంత్రి ఆర్‌కె రోజా చేతుల మీదగా సర్టిఫికేట్ అందజేస్తున్న దృశ్యం

నిండ్ర,జూలై 27 ప్రభాతవార్త : రాష్ట్రంలో వైయస్ కాంగ్రెసు పార్టీ అధికారంలో వచ్చిన తరువాత కులాలకు,పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా తెలిపారు.గురువారం మండలంలోని పాదిరి గ్రామంలో యంపిపి దీపాజలంధర్‌రాజు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత రాష్ట్రంలో వాలంటీరు వ్యవస్థ తీసుకొని వచ్చి లంచాలకు తావులేకుండా ప్రభుత్వం అందించే ప్రతి పథకం అర్హులైన వారికి అందజేస్తున్నట్లు తెలిపారు. నగరి నియోజకవర్గంలో ప్రజలు నాసేవలు గుర్తించి ఎమ్మెల్యేగా రెండుసార్లు అవకాశము ఇచ్చారని అదే ప్రకారం 2024వ సంవత్సరంలో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించి నన్ను ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో యంపిపి దీపాజలంధర్‌రాజు, తహాశీల్దారు అమరేంద్రబాబు, యంపిడిఓ అరుణ, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణరెడ్డి, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్‌కుమార్, సర్పంచ్ సూర్య,యంపిటిసి రమ్య ధశరధనాయుడు,మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి,నాయకలు గోపిక్రిష్ణ, మహేష్, మేరీజయరామ్, శివలింగ ఆచ్చారి, సుబ్రమణ్యంయాదవ్, సంపత్, చార్లీ, వీరయ్యనాయుడు, సత్యరాజ్,రాము, విజేష్, దాము, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ హ్యాట్రిక్‌పై షార్ దృష్టి

**- ఆరు నెలల వ్యవధిలో 6వ రాకెట్ ప్రయోగం - పిఎస్ఎల్‌వి సి-56 ద్వారా ఏడు సింగపూర్ ఉపగ్రహాల ప్రయోగం - ఆన్‌లైన్‌లో ముగిసిన ఎంఆర్ఆర్ సమావేశం- 29న ఉదయం 5 గంటల నుంచి కౌంట్‌డౌన్**



పిఎస్ఎల్‌వి సి-56 ద్వారా ప్రయోగించనున్న సింగపూర్ ఉపగ్రహం

శ్రీహరికోట (తడ), జూలై 27 ప్రభాతవార్త : అంతరిక్ష పరిశోధనలో అలవోకగా విజయాలు సాధిస్తున్న ఇస్రో డబుల్ హ్యాట్రిక్‌కు సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి ఈ నెల 30న పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. గత ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా కేవలం ఆరు నెలల్లో షార్ శాస్త్రవేత్తలు ప్రయోగిస్తున్న 6వ రాకెట్ ఇది. ఒక ఎల్‌విఎం3 ఎం3 రాకెట్ ద్వారా 36 వన్‌వెబ్ ఉపగ్రహాలను ప్రయోగించారు. మరో ఎల్‌విఎం3 ఎం4 రాకెట్ ద్వారా ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ఒక జిఎస్ఎల్‌వి మార్క్2, ఒక స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వి డి2) రాకెట్లను కూడా షార్ నుంచి ఈ ఏడాది విజయవంతంగా ప్రయోగించారు. ఆదివారం నింగికి ఎగరనున్న పిఎస్ఎల్‌వి సి-56కు ముందే పిఎస్ఎల్‌వి సి-55 రాకెట్‌ను కూడా ప్రయోగించి ఉన్నారు. రాకెట్ ప్రయోగాలపరంగా ఒకే ఏడాది ఐదు ఘన విజయాలు సొంతం చేసుకున్న ఇస్రో 6వ రాకెట్‌ను కమర్షియల్ లాభాల కోసం ప్రయోగిస్తోంది. మన స్వదేశీ ఉపగ్రహం లేకుండా కేవలం విదేశీ ఉపగ్రహాలను మాత్రమే ఈ రాకెట్ ద్వారా అంతరిక్షంలోని లోఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టనున్నారు. అందులో ఒకే దేశానికి చెందిన ఏడు ఉపగ్రహాలు ఉన్నాయి. శ్రీహరికోటలో సింగపూర్ దేశానికి చెందిన వివిధ అంతరిక్ష పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు గత కొన్నివారాలుగా ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. రాకెట్ ప్రయోగానికి ముందు 25 గంటల 30 నిమిషాల పాటు కౌంట్‌డౌన్ నిర్వహిస్తారని తెలిసింది. ఈ లెక్కన ఈ నెల 29న ఉదయం 5 గంటల నుంచి కౌంట్‌డౌన్ ప్రారంభించి పిఎస్ఎల్‌వి సి-56 రాకెట్ ద్రవ ఇంధన దశను నింపుతారు.

## స్విమ్స్‌లో త్వరలో...

# లివర్ మార్పిడి శస్త్రచికిత్సలు

**టిటిడి ఇఓ ఎవి ధర్మారెడ్డి**




సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి ఇఓ ఎవి ధర్మారెడ్డి

తిరుపతి టౌన్, జులై 27 ప్రభాతవార్త : స్విమ్స్‌లో త్వరలో లివర్ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభించ నున్నట్లు తెలిపారు. స్విమ్స్‌లో సాయంత్రం 5.30 గంటలకు శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీ 1 నందు సర్జికల్ గ్యాస్ట్రోయాంట్రాలజి విభాగం, ఇండియన్ చాప్టర్ ఆఫ్ ఇంటర్నెషనల్ హెపాటో పాంక్రియాటో బిలయరీ అసోసియేషన్‌ల సంయుక్త ఆద్వర్యంలో హెచ్‌పిబి సర్టిఫికెట్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు ముఖ్య అతిధిగా టిటిడి ఇఓ ఎవి ధర్మారెడ్డి, టిటిడి జెఇవో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి సదా భార్గవి, సర్జికల్ గ్యాస్ట్రో యాంట్రాలజి విభాగాధిపతి డా॥వెంకటరామిరెడ్డి, రిజిస్ట్రార్ డా. అపర్ణ బిట్ల, ప్రిన్సిపల్ డా॥శరణ్ బి.సింగ్, డా॥నవీన్ మెహ్రా, డా॥ శివరామకృష్ణ, డా॥ చంద్రమౌళీశ్వరలు సంయుక్తంగా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ప్రాంక్రియాస్ మార్పిడి శస్త్రచికిత్సలను కూడా ప్రారంభించే ఆలోచన వున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత 6 నెలల్లో స్విమ్స్ సర్జికల్ గ్యాస్ట్రో యాంట్రాలజి విభాగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఆ విభాగానికి రానున్న రోజుల్లో ఇంకా అవసరమైన ఆధునాతన పరికరాలను సమకూర్చున్నట్లు తెలిపారు. అనంతరం టిటిడి జేఇఓ , స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి సదాభార్గవి మాట్లాడుతూ స్విమ్స్ సిర్జకల్ గ్యాస్ట్రో యాంట్రాలజి విభాగం నిర్వహిస్తున్న హెచ్‌పిబి, సర్టిఫికేట్ కోర్సు కార్యక్రమానికి దేశంలోని వివిద వైద్య సంస్థల నుంచి 65 మంది ఎంపిక చేసిన గ్యాస్ట్రోయాంట్రాలజి విభాగపు పిజి విద్యార్థులు హాజరయ్యారని వారికి శిక్షణ ఇచ్చేందుకు 50 మంది నిష్ణాతులైన వైద్య నిపుణులు విచ్చేసారన్నారు. స్విమ్స్‌ను టిటిడి తీసుకున్న తర్వాత వివిధ విభాగాలకు సుమారు 1 కోటి రూపాయిలు ఆధునిక శస్త్ర చికిత్స పరికరాలు, యంత్రాలను టిటిడి సమకూర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనివాసరెడ్డి, డా. రజనీకాంత్, డా. చరణ్, సర్జికల్ గ్యాస్ట్రోయాంట్రాలజి వైద్యులు, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, ఆర్ఎంఓ కోటి రెడ్డి, డా. ముక్తేశ్వరయ్య, డా. శ్రీహరిరావు, డా. కళావత్, డా. ఉషాకళావత్ వివిధ విభాగాలకు చెందిన వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి సీటుపై...తెగని పంచాయితీ!

**-టిక్కెట్ ఖరారుకు ముందే తెలుగు తమ్ముళ్ళలో వర్గ విభేదాలు**

ప్రభాతవార్త-తిరుపతి:

"చెవిలోని జోరీగ ఇంటిలోని పోరు" ఇంతింత కాదయా అనే నానుడి ఇప్పుడు తిరుపతి తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ప్రస్ఫుటమవుతోంది. ఎన్నికలకు కొద్దినెలలు సమయం మాత్రమే ఉండటంతో తిరుపతి టిక్కెట్ కోసం తెలుగుతమ్ముళ్ళలో ఆరాటం వారి మధ్య వర్గవిభేధాలకు కారణమవుతోంది. ఇప్పటికే ఇక్కడ సీటుపై సూచాయప్రాయంగా తేల్చేసిన అధినేత చంద్రబాబు నాయుడు మళ్ళీ పార్టీలో సమన్వయం లేకుండా చేస్తున్నారనే విమర్శలు కార్యకర్తలు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇందుకు తాజాగా గతంలో పిఆర్‌పి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి,ఆ తరువాత కొంతకాలం జనసేనతో చలామణి అయిన నాయకుడు 2019 ఎన్నికల్లో టిడిపి గూటికి చేరిన ఊకా విజయకుమార్ తిరుపతి టిక్కెట్ అడుగుతుండటంతో పార్టీలో లొల్లి మొదలైంది. మాజీముఖ్యమంత్రి,టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సొంత జిల్లా అయిన తిరుపతిలో పార్టీని ఒకతాటిపై నడిపించాల్సింది పోయి ఎన్నికలకు ముందు విబేధాలు తలెత్తేలా చూస్తున్నారని పార్టీలో కొందరు గుప్పుమంటున్నారు. ఇప్పటికే తిరుపతిలో పార్టీకి తీవ్ర నష్టం జరిగిందని, ఉన్న కార్యకర్తలను, అభిమానులను, ఓటుబ్యాంకును కాపాడుకోకుంటే పరిస్థితి చేయిదాటిపోతుందని కార్యకర్తలతో బాటు కొందరు సీనియర్ నేతలు కూడా ఒకింత అసహనం వెలిబుస్తున్నారు. తొలి నుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారిని కాకుండా పార్టీ మారివచ్చిన నాయ కులకు పదవులు, టిక్కెట్ ఇస్తే పార్టీ పరిస్థితి మరింత ఇబ్బందులు ఎదుర్కోనడం తప్పదని లుకలుకలు మొదలయ్యాయి. తిరుపతిలో పార్టీకి ఉన్న పటిష్ట ఓటుబ్యాంకు ,అభిమానులు కాపాడుకోవాల్సిన అధిష్టానం ఇలా నాన్చుడు ధోరణితో వ్యవహరించడం చివరకు పరిణామాలు ఎక్కడకు దారితీస్తాయనేది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తిరుపతిలో పార్టీలో నాలుగువర్గాలుగా విడిపోయిన నేతలు కలసి పనిచేయాల్సింది పోయి వర్గవైషమ్యాలకు కారణమవుతున్నారనేది కార్యకర్తలు ఏకంగా చంద్రబాబు, లోకేష్‌కు మొరపెట్టారు. పార్టీలో బలమైన నేతల నాయ కత్వాలు వదలుకుని చంద్రబాబు దృష్టిలో మెహర్బానీ కోసం ప్రాకులాడుతున్న నేతలకు అందలమెక్కిస్తే పార్టీకి నష్టం తప్ప మరోకటి లేదని వ్యాఖ్యలు మొదలయ్యాయి. ఇప్పటికే స్థానికంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ, పార్లమెంట్ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, రాష్ట్ర కార్యదర్శులు సూరా సుధాకర్‌రెడ్డి, పుష్పావతియాదవ్, బుల్లెట్ రమణ, ఇనుకొండ సుబ్రమణ్యం, మబ్బు దేవ నారాయణరెడ్డి, దంపూరి భాస్కర్‌యాదవ్, బి.శ్రీధర్‌వర్మ, తెలుగుయువత, తిరుపతి నగరకమిటీ మధ్య సమన్వయం లేక ఎవరికివారే అన్నట్లు తయారైంది. వీరందరినీ ఒకేతాటిపై నడిపించాల్సిన అధిష్టానం ఇటీవల చిత్తూరుకు చెందిన న్యాయవాది సురేంద్ర బాబును పరిశీలకుడుగా నియమించారు. అయినా ఇక్కడ పార్టీలో ఐక్యత కొరవడటం, సమన్వయంతో ప్రజా సమస్యలపై అధికార పార్టీపై ఢీ కొనడంలో నేతలు విఫలమయ్యారు. ఈ నేపధ్యంలో టిక్కెట్ పేరుతో పార్టీలో వర్గవిభేధాలు తలెత్తి ఓటుబ్యాంకు నష్టపోయే ప్రమాదం ప్రస్ఫుటమవుతోంది.

# సీనియర్లు జవాబుదారి తనంతో పని చేయాలి

**-సత్యవేడు నియోజకవర్గ సమీక్షలో చంద్రబాబు**



శ్రీకాళహస్తి,జూలై 27 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలోని తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న సత్యవేడు నియోజక వర్గంలో రాజకీయ తాజా పరిస్థితిపై గురువారం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యులతో పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నేడు రాష్ట్రం క్లిష్ట పరిస్థితిలో ఉంది. పార్టీ సీనియర్లు జవాబు దారి తనంతో పని చేయాలి. భేషిజాలు పక్కన పెట్టాలి. పార్టీని గెలిపించుకునే లక్ష్యంతోనే ముందుకు సాగాలని సూచించినట్లు తెలిసింది.గురువారం నాటి సమీక్షకు పార్టీ అధ్యక్షుడు నరసింహా యాదవ్, మాజీ శాసనసభ్యుడు, గతంలో సత్యవేడు నియోజకవర్గంలో పార్టీని విజయ పథంలో నడిపిన ఎస్‌సివి నాయుడు, నియోజకవర్గ పరిశీలకులు న్యాయవాది సురేంద్రకుమార్, ఎంఎల్‌సి రాంగోపాల్‌రెడ్డిలను మాత్రమే ఆహ్వానించారు. వారితో చంద్రబాబునాయుడు అంతరంగికంగా సమీక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చోటు చేసుకున్న వడిదుడుకులను చంద్రబాబు ఒక్కొక్క పాయింట్‌గా చర్చించినట్లు తెలిసింది. నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిగా భావిస్తున్న డాక్టర్ హెలెన్ పార్టీ కార్యకర్తలు, ప్రజలతో వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆరా తీసినట్లు సమాచారం.గతంలో నియోజకవర్గంలో పార్టీని సమర్థవంతంగా నడిపించే నాయకుడు లేక కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు కుడి ఎడమలుగా ఉన్నారు.నేటి పరిస్థితి ఏమిటని చర్చించారు. ప్రస్తుతం పరిస్థితి కుదుట పడిందని పార్టీ నాయకులు చంద్రబాబుకు వివరించినట్లు తెలిసింది. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై స్పందించాలన్నారు. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయటంతో మన విజయం సులభమౌతుందని చంద్రబాబు నాయకులకు దిశ దెశ నిర్దేశం చేసినట్లు సమాచారం.

**ఎస్‌సివి పై భారం:**

సత్యవేడు నియోజకవర్గంలో పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేయటానికి సీనియర్‌గాను ఆ ప్రాంత నాయకులు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలున్న ఎస్‌సివి నాయుడు రాబోవు ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో కీలకంగా వ్యవహరించి పార్టీని విజయపథంలో నడుపుటకు కంకణబద్దులు కావాలని సూచించినట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో పార్టీ పూర్వ వైభవానికి రావటానికి పట్టుదలతో పని చేయాలని ఆదేశించినట్లు తెలిసింది.నాయకులు సమన్వయంతో సమయస్పూర్తితో పని చేయాలని పార్టీలో ఎవరి మధ్య అయినా విభేదాలుంటే పక్కన పెట్టి పార్టీ విజయం పార్టీ అధికారంలోకి రావటానికి కృషి చేయాలన్నారు.

## మునిసిపాలిటీ చేసి...

# ప్రజలపై భారం మోపారు

**-టిడిపిపై మంత్రి రోజా ధ్వజం**




పుత్తూరు, జూలై 27 ప్రభాతవార్త : పుత్తూరును మునిసిపాలిటీగా చేసి తెలుగుదేశం పార్టీ ప్రజలపై పన్నుల భారం మోపిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఆరోపించారు. రూ. 64 కోట్ల రూపాయలతో పుత్తూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. టిడిపి నాయకులు పుత్తూరులో శ్మశానాన్ని కూడా కబ్జా చేసి దోచుకున్నారన్నారు. మునిసి పాలిటీలో దాసరిగుంట సచివాలయ పరిధిలో రూ. 15.44 కోట్లు, గోవింద పాలెం పరిధిలో రూ. 16.83 కోట్లు పిళ్లారిపట్టులో రూ. 12.82 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. మునిసిపాలిటీలోని గోవిందపాలెం, పిళ్లారిపట్టు, దాసరిగుంట సచివాలయాల పరిధిలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తండ్రికి మించిన తనయుడిగా ప్రజాదరణ పొందుతున్నారని, పాదయాత్రలో ప్రజల కష్టాలు చూసి అధికారంలోకి రాగానే వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు విజన్ 2020 కాదని విజన్ 420 అని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అమ్మఒడి, రైతు భరోసా, నేతన్న నేస్తం వంటి సంక్షేమ పథకాలు చంద్రబాబు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.జగనన్న దానకర్ణుడని, చంద్రబాబు కుంభకర్ణుడని ఎద్దేవా చేశారు. రాజధాని ప్రాంతంలో 50 వేల ఇళ్లకు శంకుస్థాపన చేస్తే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో గంజాయి సాగు విచ్చలవిడిగా సాగిందని, పుత్తూరులో టిడిపి నాయకులు గంజాయి విక్రయిస్తూ రెండు సార్లు పోలీసులకు దొరికిపోయి, జైలుకు కూడా వెళ్లారని విమర్శించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్.కె.సెల్వమణి, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు డి.జయప్రకాశ్, డి.శంకర్, కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి తదితర అధికారులు, వైకాపా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా...

# కాణిపాకం బ్రహ్మోత్సవాలు

**-సేకరించిన భూముల్లో పలు అభివృద్ధి పనులు -పాలకమండలి తీర్మానం**



కాణిపాకం, జూలై 27 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆలయ పాలకమండలి తీర్మానించినట్లు ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. గురువారం పాలకమండలి ఛైర్మన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో పాలకమండలి సమావేశం జరిగింది. ఈసమావేశానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సంభందించి పలు అంశాలపై పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించి కీలక నిర్ణయాలను తీసుకున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు సమావేశం అనంతరం విలేకరులకు వివరించారు. వారు మాట్లాడుతూ దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలని పాలకమండలి నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ఇటీవల సేకరించిన 18.60 ఎకరాల భూముల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేట్టాలని, ఇందులో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మాట్రిక్స్ సంస్థ ద్వారా ప్రణాళికలు సిద్దం చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్లుఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు.అలాగే టీటీడీ బోర్డు సభ్యుడు మురంశెట్టి రాములు విజ్ఞప్తి మేరకు అఖిల భారత గణేష్ సేవాదళ్ సంస్థ ఏర్పాటుకు పాలకమండలి ఆమోదిస్తూ ఇందుకోసం 20 సెంట్లు దేవస్థానం భూమిని కేటాయించాలని తీర్మానించినట్లు తెలిపారు.నూతన బస్టాండు, క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆగస్టు 1న శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు నరసింహులు శెట్టి, మారుతీశ్వరరావు,కాంతమ్మ, సుబ్బలక్ష్మమ్మ,ఎక్స్ అఫిషియో సభ్యులు సోమశేఖర్ గురుకుల్, టీటీడీ బోర్డు సభ్యుడు మురంశెట్టి రాములు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ,కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, హేమమాలిని, సూపరెండెంట్‌లు రంగస్వామి, రవి, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణముఖి ఆనకట్ట ఆధునీకరణ ఇంతేనా?

**-రెండేళ్లు గడచినా పట్టించుకోని 'తుడా' -నిధుల కొరతతో ఆగిన పనులు -అసాంఘీక కార్యక్రమాలకు అడ్డగా మారిన కట్ట**

**ఆశయాల, లక్ష్యాలు మహోన్నతం. అభివృద్ధియే ఆయన అజెండా.ఈ నేపధ్యంలో రెండేళ్ళ క్రితం హంగామాగా స్వర్ణముఖి నదీ ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టారు శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి. ఆయన ఆలోచనలకు చేదోడు అంటూ తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిలిచారు. పవిత్ర దేవాలయ పట్టణంలో ప్రవేశిస్తూనే దర్శనమిచ్చే స్వర్ణముఖి ఆనకట్ట ఆధునీకరణ పనులకు రూ.7.5కోట్లతో ప్రతిపాధనలు రూపొందించారు. ఏడాది తరువాత టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభించారు. నిధుల కొరతతో ఏడాదిగా పనులు ఆగాయి. వర్షాకాలం ప్రారంభమైంది. దాంతో స్థానికులు 'స్వర్ణముఖి ఆనకట్ట' పనులు ఇంతేనా అంటూ చర్చించుకుంటున్నారు. ఈ కట్ట నేడు అసాంఘీక కార్యక్రమాలకు, తాగుబోతులు, గంజాయి పార్టీకి అడ్డగా మారింది. పొద్దుగుంకితే ఇక్కడ విచ్చల విడిగా ఆకతాయిల అగడాలు సాగుతున్నాయి. అయినా పోలీసులకు కనిపించదు.**





చినుకులకే చిత్తడిగా మారిన ఆనకట్ట- ఆనకట్టపై పడేసిన మద్యం బాటిల్స్

శ్రీకాళహస్తి,జూలై 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఎంతో మహోన్నత ఆశయంతో చేపట్టిన స్వర్ణముఖి నది ఆధునీకరణలో భాగంగా పనులు నిధుల కొరతతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. సుమారు రెండేళ్ళ క్రితం తుడా సహాకారంతో చేపట్టిన ఆధునీకరణకు నిధుల కొరత శాపంగా మారింది. సగంలోనే పనులు ఆగి, కట్టపై మట్టిపోసి నదిలో కాంక్రీట్ గోడ కట్టి వదలి పెట్టారు.

**ఆకతాయిల అడ్డాగా మారిన కట్ట:**

తుడా సారధ్యంలో దశల వారిగా చేపట్టాల్సిన స్వర్ణముఖి నది కరకట్ట సుందరీకరణ పనులకు నిధుల కొరత మారింది. మొదటి దశలో కరకట్టను స్థిరీకరణ గావించారు. మొదటి దశలో రూ.5కోట్లతో పనులు చేపట్టారు. నదిలో కాంక్రీట్ గోడను నిర్మించారు. ఎత్తుగా ఎర్రమట్టిని పోసి, చక్కగా చదును చేసారు. ఇక్కడ రక రకాల అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ తుడా ఈ పనుల గురించి పట్టించుకోవటం లేదు. చేసిన పనులకు కూడా బిల్లులుచెల్లించలేదని తెలిసింది.పనులు చేసిన కాంట్రాక్టర్ కు రూ.1.3కోట్లలు ఇంకా చెల్లించాల్సి ఉంది. మరో 1.8కోట్లతో ప్రతిపాదనలు పంపారు.కానీ నిధులు విడుదల కాలేదు. దాంతో కట్ట అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. మరికొందరు గంజాయి బ్యాచ్‌కు సిట్టింగ్‌కు అనుకూలంగా మలచుకున్నారు. ఇలా కోట్లు రూపాయలు పెట్టిన ప్రాజెక్టు అసాంఘీక కార్యక్రమాల అడ్డాగా మారింది. పట్టణ నడిబొడ్డులోని స్వర్ణముఖి ఆనకట్ట ఆధునీకరణ పనులు ఆగిపోవటంతో ఇదో ఆకతాయిల అడ్డాగా మారింది. పొద్దుగుంకితే ఈ మార్గంలో అడుగుపెట్టలేని స్థితి చోటు చేసుకుంది. ఎన్నో సంస్కరణలు చేపడుతున్న పోలీసులకు ఇక్కడ జరిగే అరాచకాలు కనబడటం లేదా? అనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఓపెన్ బార్‌గా మారిన స్వర్ణముఖి ఆనకట్టపై పోలీసులు ఎందుకు పట్టించు కోవటం లేదనే విమర్శలు బహిరంగంగా వినబడుతున్నాయి.

**ఆధునీకరణ పనులపై తుడా మౌన మేల?**

పరమ పవిత్రమైన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జవాబుదారి తనంతో తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శంకుస్థాపన చేసిన స్వర్ణముఖి ఆధునీకరణ పనులకు నిధుల కొరతతో ఆగాయి. రెండేళ్లు గడిచాయి. నాటి సభలో తుడా ఛైర్మెన్ భాస్కర్‌రెడ్డి ఎంత నిధులు అయినా వెచ్చించుటకు వెనుకాడమన్నారు.కానీ రెండేళ్ళు గడచినా తాము వేసిన శిలాఫలకం పరిస్థితి ఏమిటన్నది పట్టించుకోవటం లేదు.నాయకుల మాటలు నీటి మూటలేనా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# అటవీ కార్మికుల పట్ల టిటిడి తీరు దారుణం

**-సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు**




తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 27 ప్రభాతవార్త: అటవీ కార్మికుల పట్ల టిటిడి యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు దారుణమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మండిపడ్డారు.స్థానిక హరేరామ హరేకృష్ణ రోడ్డులోని అటవీ కార్యాలయం ముందు అటవీ కార్మికులు తమకు టైం స్కేల్ ఇవ్వాలని కోరుతూ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి వెయ్యి రోజులకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా అటవీ కార్మికులకు మద్దతుగా అఖిలపక్ష నేతల ఆధ్వర్యంలో టిటిడి పరిపాలనా భవనం నుండి వందలాది మంది కార్మికులు అటవీ కార్యాలయం వరకు ప్రదర్శనగా చేరుకున్నారు.అక్కడ దీక్షా శిబిరం వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షతన జరిగిన నిరసన సభకు నర్సింగరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 200 మంది కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం వెయ్యి రోజులుగా నిరాహార దీక్షలు చేయడం టిటిడి లాంటి ధార్మిక సంస్థకు గౌరవనీయంకాదన్నారు.నిత్యం అర్థాకలితో ఓవైపు కార్మికులు పస్తులుంటే..టిటిడి ఈఓ,ఛైర్మన్,ఐఏఎస్,ఐపిఎస్ అధికారులకు అన్నం ఎలా సహిస్తున్నదని ప్రశ్నించారు. టిటిడి ఈఓ ధర్మారెడ్డి నియంతృత్వం కారణంగానే టిటిడిలో రోజు రోజుకు సమస్యలు జఠిలమవుతున్నాయని టిడిపి నేతలు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,పులివర్తి నాని,దంపూరి భాస్కర్ యాదవ్‌లు ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే అటవీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, సిపిఎం నాయకులు నాగరాజు, సుబ్రహ్మణ్యం,ఆర్‌పిఐ అధ్యక్షుడు అంజయ్య, న్యాయవాదులు తదితరులు పాల్గొని అటవీ కార్మికులకు మద్దతు ప్రకటించారు. నిరసనలో టిటిడి అటవీ కార్మికుల యూనియన్ నేతలు ఈశ్వర్‌రెడ్డి, సురేష్, సురేంద్ర, వేణు, మునికృష్ణ,పురుషోత్తం,కేశవులు,విశాలాక్షి,కృష్ణ,కృష్ణమూర్తి, ఆర్.శ్రీనివాసులుపాల్గొని ప్రసంగించారు.

# నిరుపేదల చూపు సిఎం జగనన్న వైపే : ఎమ్మెల్యే

పెద్దపంజాణి జూలై 27 ప్రభాతవార్త :

రాష్ట్రంలోని నిరుపేదలంతా సిఎం జగన్మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని పలమనేరు ఎమ్మెల్యే డా॥ఎన్.వెంకటేగౌడ పేర్కొన్నారు.గురువారం పెద్దపంజాణి మండలం రాజుపల్లి పంచాయతీ పరిధిలోని సొన్నేపల్లి,చీమనపల్లి,మాధనపల్లి,కత్తార్లపల్లి,చింతలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే గడపగడపకు మీప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్ఘపాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలోవున్న ప్రజల కష్టాలు చూసిన సిఎం జగనన్న అధికాంలోకిరాగానే ప్రజలకుఇచ్చిన హామీలను 4.5ఏళ్ళ కాలంలోనే 99శాతం అమలు చేశారని పేర్కొన్నారు.గతంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా వైకాపాప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీటవేస్తూ దేశంలోనే ఎక్కడాలేని విధంగా



సంక్షేమపథకాలు అమలు చేస్తోందన్నారు.కరోనాలాంటి సమయంలో సైతం ఇచ్చిన తేదీ ప్రకారం అర్హులైన పేదలకు ఆయా సంక్షేమపథకాల్లో నగదు జమచేసినఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు.గత ప్రభుత్వహయాంలో ప్రభుత్వపథకాల్లో లబ్దిపొందాలంటే జన్మభూమి కమిటీలకు చేయితడపడం లేదా నాయ కుల ఆశిస్సులు ఉంటేతప్ప అర్హులైన పేదలకు న్యాయం జరిగేది కాదన్నారు. మరోప్రక్క రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 468గృహాలను ఎమ్మెల్యే సందర్శించి వారికి వివిధ ప్రభుత్వ పథకాల్లో కలుగుతున్న లబ్ది గురించి వివరించారు.కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెప్ప,వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి,జెడ్పీటిసి సుష్మాకీర్తి,వైస్ ఎంపిపిలు అంజమ్మ,జిడి.బాబు, జిల్లా కార్యదర్శి ఎ.తమ్మిరెడ్డి,మండల జెసిఎస్ కన్వీనర్ పృధ్వీనాథ్, సర్పంచులు నర్మదానగేష్,హరినాథ్,స్వర్ణలత,పగడాల మురళి, ఏఎంసి డైరక్టర్ సురేష్,నేతలు కృష్ణప్ప,అమర్నాథ్ రెడ్డి,పూల శంకర్ రెడ్డి, శ్రీరాములు రెడ్డి,రమేష్,వెంకట్రమణ,అనంతకుమార్,కత్తార్లపల్లి క్రిష్ణప్ప, రమణ, మండలస్థాయి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భరత్‌చే పదివేల ఆర్థికసాయం

కుప్పం, జూలై 27 ప్రభాతవార్త :



గుడుపల్లె మండలం చీకటిపల్లికి చెందిన జల్లప్ప అనే వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలిసిన ఎమ్మె ల్సీ ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ జల్లప్ప అంత్య క్రియల కోసం తనవంతుగా పదివేల రూపాయల ఆర్థికసాయంను అందించారు. ఈనగదును జడ్పీటిసి కృష్ణమూర్తి, ఆర్‌బికె ఛైర్మన్ మంజప్ప తదితరులు బాధిత కుటుంబంకు అందించారు.

## జిల్లా ఎస్పీచే రివార్డు అందుకున్న ఎస్సై శివకుమార్

కుప్పం, జూలై 27 ప్రభాతవార్త



కుప్పం అర్బన్ ఎస్సై శివకుమార్ గురువారం జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. కుప్పం అర్బన్ స్టేషన్ పరిధిలో 18 చోరీలకు సంబంధించిన కేసుల ఛేదనలో ఎస్సై శివకుమార్ విశేష ప్రతిభ చూపి పలు చోరీలకు సంబంధించి సొత్తులను రికవరీ చేయడంలో కీలకపాత్ర పోషించారు. దీంతో ఎస్సై శివకుమార్‌కు జిల్లా ఎస్పీ నగదు రివార్డు అందించారు. అలాగే కానిస్టేబుల్ జయశంకర్‌కు సైతం ఎస్పీ నగదు రివార్డు అందజేశారు.

## మద్యంతాగి వాహనాలు నడిపినవారికి జైలుశిక్ష

కుప్పంరూరల్, జూలై 27 ప్రభాతవార్త

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కుప్పం జడ్జి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. అర్బన్ సిఐ శ్రీధర్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టగా ఏడుమంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రెండు రోజుల జైలుశిక్ష, రెండువేల వంతున జడ్జి జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## తిరుమలకు పెరిగిన గోవిందమాల భక్తుల పాదయాత్ర

**నారాయణవనం, జూలై 27 ప్రభాతవార్త :** కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వరున్ని దర్శించుకోవడం కోసం తిరుమలకు గోవిందమాల భక్తుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. తమిళనాడు రాష్ట్రం చెన్నై, రెడ్‌మిల్, తిరువళ్లూరు, పెరంబూరు, పొన్నేరి, ఊత్తుకోట తదితర ప్రాంతాల నుంచి గోవిందమాల దరించుకొని వందలసంఖ్యలో భక్తులు పాదయాత్ర చేపడుతున్నారు. ఈనెల ఆషాడ మాసం కావడంతో వందలసంఖ్యలో భక్తులు గోవిందమాలను దరించుకొని భజనలు చేసుకుంటూ యాత్రను నిర్వహిస్తున్నారు. నారాయణవనంలో ప్రసిద్ది చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని దర్శించుకుంటున్నారు. వీరికి తగిన సౌకర్యం లేకపోవడంపై అసంతృప్తి చెందుతున్నారు. అయితే నారాయణవనంకు చెందిన కొంతమంది దాతలు ముందుకు వచ్చిన అన్నదానం చేశారు. ఇలాంటి అన్నదానం ప్రతిరోజు మధ్యాహ్నం పూట అందిస్తే బాగుంటుందని కోరుతున్నారు. దాతలు ముందుకు రావాలని కోరుతున్నారు.

## మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైకాపాలో చేరిక

శాంతిపురం, జూలై 27 ప్రభాతవార్త :



శాంతిపురం మండలంకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు బోయనపల్లి కేశవులు, గడ్డూరు రమేష్‌లు గురువారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర ్భంగా మంత్రి వీరిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ ఇద్దరు నేతలు వైకాపలో చేరేందుకు సర్పంచ్ ఎవి జయరాం చొరవ చూపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, కన్వీనర్ దండపాణి, సర్పంచ్ ఎవి జయరాం, జగదీష్‌నాయుడు, విజయ్‌కుమార్, కుప్పం మాజీ పిఏసిఎస్ ఛైర్మన్ పత్రాల మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుసిఎం జగనన్నతోనే సాధ్యం



ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

శాంతిపురం, జూలై 27 ప్రభాతవార్త :

సంక్షేమ పథకాల అమలు సిఎం జగనన్న తోనే సాధ్యమని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. గురువారం 121 పెద్దూరు పంచాయతీలో ఆయన గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కలిగిన లబ్దిని వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు.కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, నేతలు మునిరత్నం గౌడు, లోకేష్‌రెడ్డి, ఎంపిటిసి రవి, సర్పంచ్ వెంకటరామిరెడ్డి, బాబురెడ్డి, చెంగప్ప, రామకృష్ణ, గజ్జల రమేష్ పాల్గొన్నారు.

## కస్తూరిబా గురుకులంలో మొక్కలు నాటే కార్యక్రమం

రామకుప్పం, జూలై 27 ప్రభాతవార్త :



మండలంలోని విజలాపురం కస్తూరి గురుకు లంలో గ్రీన్‌కుప్పం, చిత్తూరు అమ్మఒడి సేవాశ్రమం అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా అమ్మఒడి సేవాశ్రమం వ్యవస్థాపకులు పద్మనాభనాయుడు, గ్రీన్‌కుప్పం సభ్యులు మునసా ్వమి, డా॥ వరదరాజులు, చంద్రమోహన్‌మాట్లాడుతూ మున్ముందు మరిన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుతామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, జానకిరామ్, మనోహర్, ప్రిన్సిపాల్ అమరావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గడపగడపకులో ప్రజా సమస్యల పరిష్కారం:ఎమ్మెల్యే

కాణిపాకం, జూలై 27 ప్రభాతవార్త:



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను అక్కడి ఒక్కడే పరిష్కరిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు.గురువారం మండలంలోని కాణిపాకం గ్రామ సచివాలయ పరిధిలోని అరుణానగర్, వినాయకపురం గ్రామాలలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే గడప గడపకు- మన ప్రభుత్వం కార్యక్రమంను నిర ్వహించారు. ఈసందర ్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చింతం మోహన్, ఎంపీడీఓ నాగరాజు,తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి,కాణిపాకం ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలజ సుధీర్, కార్యదర్శి సత్యంరెడ్డి, మండల స్థాయి నాయకులు,చిన్నారెడ్డి, సురేష్ రెడ్డి, సుధీర్, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, జూలై 27 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన ఆద్యరెడ్డి బిల్లా అనే భక్తుడు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ,ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల కళ్లల్లో ఆనందం చూడడమే సిఎం లక్ష్యం : ఛైర్మన్



కుప్పంరూరల్, జూలై 27 ప్రభాతవార్త :

పేదల కళ్లల్లో ఆనందం చూడడమే సిఎం జగనన్న లక్ష్యమని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధి 13,19,21 సచివాలయా ల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపిస్తున్న సిఎం జగనన్నను ప్రజలు మరోమారు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ప్రజల వద్దకే సచివాలయాల ద్వారా పాలన తెచ్చిన ఘనత వైకాపా ప్రభుత్వంకే దక్కుతుందన్నారు. అనంతరం ఎక్కువ సర్టిఫికెటు ్ల నమోదు చేసిన వాలంటీర్లు సాయిప్రియ, ద్రాక్షాయణి, ఆశలను ఛైర్మన్ నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగయ్య, లావణ్య సురేష్, గణపతి, రాజ్‌కుమార్, విజయ్, సోమశేఖర్, మాజీ సర్పంచ్ వెంకటేష్, ఆంజనేయ గుడి ఛైర్మన్ కుమరేష్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి కిసాస్ సమృద్ధి కేంద్రాలు ప్రారంభం

కుప్పం/శాంతిపురం/రామకుప్పం, జూలై 27 ప్రభాతవార్త :

ప్రధాని నరేంద్ర మోడి గురువారం దేశవ్యాప్తంగా కొత్తగా ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా కుప ్పం, శాంతిపురం, రామకుప్పంలో ఏర్పాటైన కేంద్రాలలో కుప్పం ఇన్‌చార్జ్ శివశంకర్, రాష్ట్ర ఒబిసి విభాగం సభ్యుడు తులసినాథ్, మండల పార్టీ అధ్యక్షులు వడివేలు, కాశీనాథ్, రామచంద్ర తదితరులు పాల్గొని కేంద్రం రైతులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బాలాయపల్లి ఎంఈవోగా వెంకటేశ్వర్లు



బాలాయపల్లి, జులై 27, ప్రభాతవార్త:

బాలాయపల్లి మండల ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారిణిగా కిల్లా వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంఈవోగా పని చేస్తున్న బాలాజీ తిరుపతి బదిలీ అయ్యారు. డక్కిలి ఎంఈవో వెంకటేశ్వర్లును ఇన్‌చార్జ్ ఎంఈవోగా నియమించారు.

## తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బాలాయపల్లి, జులై 27, ప్రభాతవార్త:



పొదుపు సంఘాల వాళ్ళు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. వెలుగు కార్యాలయంలో పొదుపు గ్రూపులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బ్యాంకులో రుణాలను సకాలంలో చెల్లించాలని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం బంధం గ్రూపు లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి: కమిషనర్

వెంకటగిరి, జులై 27 ప్రభాతవార్త:



పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానికులు సహకరించాలని వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగాఆయనమాట్లాడుతూ రోడ్లపై చెత్తాచెదారం వేయరాదని సూచించారు. మున్సిపాలి టీ సిబ్బంది ఇళ్ళ ముందుకు వచ్చినప్పుడు చెత్తను వారికి అందించాలని తెలిపారు. వీధుల్లో చెత్త వేయడం వలన అశుభ్రత ఏర్పడుతుందని తెలిపారు. ఆయన వెంట శానిటరి ఇన్స్‌పెక్టర్ రామారావు, సిబ్బంది ఉన్నారు.

## రైతులు వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులు పాటించాలి



- కేవీకే అధిపతి డాక్టర్ బి.జి.రాజులు

వెంకటగిరి, జులై 27, ప్రభాతవార్త:

కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వెంకటగిరి నందు పిఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా రైతుల కొరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా 14వ విడతగా ప్రతి రైతు ఖాతాలో రూ.2000 వితరణ కార్యక్రమాన్ని వీక్షింపచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.గోవిందరాజులు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్ రైతులు వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకొని ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలను విశ్లేషించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా లీగల్ అడ్వైజర్ గురుప్రసాద్, ప్రధాన మంత్రి రైతు సమృద్ధి కేంద్రాలపై, కిసాన్ క్రెడిట్ కార్డ్ వినియోగంపై, ఇతర జాతీయ పతాకాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా. పి.నాగార్జునరెడ్డి, డా. డి.తిరుపాల్, ఐ.రాజీవన, శ్రీనివాస సేవ ట్రస్ట్ సిబ్బంది సతీష్, కేశవ, అలేఖ్య మరియు రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

కోట, జూలై 27 ప్రభాతవార్త :

కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట గురువారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలపై ధర్నా చేశారు. ముందుగా మణిపూర్ రాష్ట్రంలో మహిళల పట్ల జరుగుతున్న దారుణాలపై నిరసన వ్యక్తం చేశారు. ఆ రాష్ట్రంలో తక్షణమే రాష్ట్రపతి పరిపాలన అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం ఓటర్ల సవరణలు, మార్పులు చేర్పులపై బిఎల్‌ఓలుగా డ్యూటీలు చేయాలని అధికారులు చెప్పడం సబబు కాదన్నారు. రకరకాల యాప్‌లు, మానసిక ఒత్తిళ్లతో తమ జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. ఈ ధర్నాలో అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఖాతాల్లో పిఎం కిసాన్ నిధులు

కోట, జూలై 27 ప్రభాతవార్త :

రైతుల ఖాతాల్లోకి పిఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి రైతుల ఖాతాల్లోకి నగదు జమ అయినట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు. గురువారం పిఎం కిసాన్ సమ్మాన్ నిధులను కేంద్రప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కోట మండలంలోని 4500 మంది రైతుల ఖాతాల్లో ఈ నగదు జమ అయినట్లు చెప్పారు. ఒక్కొక్క రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబరీష్, మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పరశురాం సాయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల నిరసన

కోట, జూలై 27 ప్రభాతవార్త :

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ విద్యుత్ ఉద్యోగుల జెఏసి పిలుపు మేరకు గురువారం కోట మండలంలోని ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి భోజన విరామ సమయంలో గూడూరుకు వెళ్లి నిరసన తెలిపారు. ఆగస్టు 4, 5, 7 తేదీలలో పని గంటల మేరకే విధులు నిర్వహణ, 8న విజయవాడలోని విద్యుత్ సౌధలో మహాధర్నా, 9న డిపార్ట్‌మెంట్ సిమ్‌కార్డులు అందజేత, 10న నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు ఉద్యోగులు వివరించారు.

## సూళ్లూరుపేటలో అబ్దుల్‌కలామ్‌కు ఘన నివాళి

సూళ్లూరుపేట, జూలై 27 ప్రభాతవార్త :



భారత మాజీ రాష్ట్రపతి, అణు పితామహుడు ఎపిజె అబ్దుల్‌కలామ్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి గురువారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కాపులూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ అణు పితా మహుడుగా పేరుగాంచి శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల సంఘం తరపున ఎస్‌కె ఉస్మాన్‌బాషా, గురుస్వామిరెడ్డి, చెంగాళమ్మ ట్రుసుబోర్డు సభ్యులు ఎంఎం పద్మజ, షార్ మాజీ ఉద్యోగి శ్యామ్, పాఠశాల విద్యార్థులు, భవిత స్కూలు చిన్నారులు పాల్గొని పూలమాలలతో కలామ్‌కు ఘన నివాళి అర్పించారు.

## ఉత్తమ విద్యార్థినులకు ప్రతిభ పురస్కారం

తడ, జూలై 27 ప్రభాతవార్త :



తడ మండలం చినమాంబట్టు ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి గాను అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు గురువారం ప్రతిభ పురస్కారాలు అందజేశారు. సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు ఈ పురస్కారాలను అందించారు. తిరుపతి జిల్లాలో తృతీయ స్థానం సాధించిన కొల్లి జననికి 5116 రూపాయలు, నల్లపాటి వైష్ణవికి 2116 రూపాయలు నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని హెచ్‌డి ఫణివేణి, పలువురు ఉపాధ్యాయులు, ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## హర్ దిల్ మే వైఎస్సార్.. హం సబ్ జగన్‌కే సాథ్

గూడూరు, జూలై 27 ప్రభాతవార్త :




గూడూరు పట్టణంలోని వైసీపీ మైనారిటీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ మగ్దూమ్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మగ్దూమ్ మాట్లాడుతూ త్వరలో గూడూరు నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీలను కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేసే విధంగా ముందుకెళతామని తెలిపారు. ఇందులో భాగంగా హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాత్ అంటూ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు జనాబ్ వి.ఖాదర్‌బాషా తెలిపారు.ముందుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాను కలిసి వచ్చిన తర్వాత కార్యక్రమం తేదీలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మగ్దూమ్, యువత అధ్యక్షుడు బాబు, పట్టణ కార్యదర్శులు జమీర్, షాకిర్, యస్దాని, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే

గూడూరు, జూలై 27 ప్రభాతవార్త :

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. గూడూరు పట్టణంలోని నరసింహారావుపేట వార్డు సచివాలయం సమీపంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అధికారులతో కలిసి పలువురు అర్జీదారులకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, నాగులు తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నతుడు అబ్దుల్‌కలామ్

గూడూరు, జూలై 27 ప్రభాతవార్త :

తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ అని గూడూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ విజయకుమార్ అన్నారు. గురువారం అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాలలో అబ్దుల్ కలామ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇబి సీఐ విజయకుమార్ అక్కడ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రవిచంద్రారెడ్డి, పార్వతమ్మ, హనుమంతరావు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్లు పంపిణీ

చిల్లకూరు, జులై 27 ప్రభాతవార్త :



మండలంలోని గూడూరు గ్రామ పంచాయితీలో సచివాలయం వద్ద గ్రామ సర్పంచి నాగిశెట్టి శారద ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ కె. శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం 390 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరిగింది. చివరి రోజు అధికారులందరూ పాల్గొని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఇఓఆర్డి దాసరిమాణిక్యం, పంచాయితీ కార్యదర్శి జమీర్, విఆర్ఓ సుబ్రమణ్యం, మనోజ, దీపిక, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## వందనానికి బంధనం..! ఆర్థిక సాయానికి కాబోయే అమ్మల నిరీక్షణ

కోట,జులై 27 ప్రభాతవార్త

పీఎంఎంవీ పథకం నిలిచిపోయిన ప్రభావం గర్భిణులు తీసుకునే పోషకాహారం పై నడుతుందని సబంధిత శాఖ అధికారులే చెబుతున్నారు.చాల మంది పీఎంఎంవీవై ద్వారా అందే రూ.5 వేలతో మంచి ఆహారం,మందులు కొనుగోలు చేసుకునేవారు. ప్రస్తుతం ఈ పథకానికి విరామం ప్రకటించడంతో గర్భిణీల్లో చాల మంది షౌష్టికాహారం తీసుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మతాశిశు మరణాల రేటు తగ్గాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై )కు బ్రేక్ పడింది. ఈఏడాది మార్చి నుంచి ఈపథకంలో లబ్దిదారుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు వినియోంగే పీఎంఎంవీవై పోర్టల్ లో మార్పులు చేసి త్వరలో కొత్త యాప్ ను తేబోతున్నారు.అప్ప వరకు మ్రాతమూర్తులకు ఈపథకం ద్వారా ఆర్థిక సాయం అందే పరిస్దితి లేదు.పీఎంఎంవీవై ద్వారా మొదటి కాన్పుకు రూ 5వేలు ఆర్థిక సాయం అందుతుంది. దీనికి కొరకు ఆశా, ఆరోగ్య కార్యకర్తల దగ్గర రిజిస్టర్ చేసుకుంటారు.వీరికి మొదటి త్రైమాసికంలో రూ వెయ్యి తర్వాత ఆరో నెలలో తనిఖీలు పూర్తయ్యాక రూ2 వేలు ఇస్తారు. బిడ్డ పుట్టి మొదటి విడత టీకా కార్యక్రమం పూర్తయితే మిగతా రూవేలుతల్లిఖాతాలోజమ చేస్తారు.మార్చి తర్వాత ఈపథకం రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిపేశారు.నెలకు కనీసం రెండు వేల మంది వరకు గర్భిణీలు నమోదు చేసుకుంటారు. ఈలెక్కన గత నాలుగు నెలలగా సమారు 8 వేల మందికి లబ్దిదారులకు మొదటి విడత సాయం దక్కకుండా పోయింది.

## ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం : ఛైర్మన్

నారాయణవనం, జూలై 27 ప్రభాతవార్త :

మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీలో ప్రసిద్ధి చెందిన ద్రౌపతీదేవి సమేత ధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రజలందరి సహకారంతో విజయవంతం చేద్దామని ఆలయ కమిటీ ఛైర్మన్ టిఎస్.సొరకాయులురెడ్డి గురువారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 4వతేది నుంచి 14వ తేది వరకు ఈ ఉత్సవాలు జరుగుతుందన్నారు. 14వతేది సోమవారం రాత్రి 7గంటలకు ధ్వజ అవరోహణంతో ముగుస్తుందన్నారు.



## ఎసిబి అధికారుల దాడులంటూ పుకారుతో అధికారులు పరార్..!

**నారాయణవనం, జూలై 27 ప్రభాతవార్త :** నారాయణవనం మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఎసిబి అధికారులు దాడులు చేస్తారని సమాచారం తెలియడంతో బుధ, గురువారం మండల స్థాయిలోని అధికారులు, అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బంది ఆఫీసు వైపు రావడం లేదు. ఒక వేళ ఆఫీసుకు వచ్చిన క్యాంపుల పేరుతో జంప్ అయ్యారు. ఎసిబి అధికారుల దాడులు ఎవరిపై వుంటుందోనని జనం అతృతగా ఎదురు చూసినప్పటికి చివరికి కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది లేదనే సమాచారం తెలియడంతో ఎసిబి దాడులు కనిపించడం లేదు. దీంతో అమ్మయ్య..అంటూ అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

## రాష్ట్రంలో రైతులను ఆదుకుంటున్నది మోదీ ప్రభుత్వమే!

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్), జూలై 27 ప్రభాతవార్త :



ఆంధ్ర రాష్ట్రంలో రైతులను నిరుపేదలనూ దుకుంటున్నది కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వమే అని రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యులు కుప్పా ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం రాజస్థానలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రధాన మంత్రి కిసాన్ సన్మాన నిధి కార్యక్రమాలను బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలను వర్చువల్ విధానంలో ఏర్పేడు బిజెపి నాయకులు మండల కేంద్రంలోని కోరమాండల్ ఎరువుల దుకాణంలో తిలకించారు. కిసాన్ సన్మాన నిధులను ప్రధాని ఆయా రైతుల ఖాతాల్లో జమచేసారు. మండల వైస్ ప్రెసిడెంట్ బాలాజి రాయల్, ప్రధాన కార్యదర్శిగూళ్ళూరు దామోదర్‌రాయల్, సుబ్రమణ్యం రెడ్డి, కోలా గురవయ్యా తదితరులు పాల్గొన్నారు.

## తగ్గిన భక్తులు ఆలయం వెల వెల

శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురువారం భక్తులు గణనీయంగా తగ్గారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భక్తుల రాక తగ్గింది. దాంతో ఆలయానికి వచ్చిన భక్తులకు సుదర్శనం సత్వర దర్శనం భాగ్యం లభించింది. వర్షాలతో ఆలయం వెల వెల బోగా పట్టణంలోని హోటళ్ళు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వీధులు కళావిహీనంగా మారాయి. సాధారణంగా ఆలయానికి కనీసం 15వవేల మంది వచ్చే వారు. కానీ గురువారం ఆలయాధికారులు జారి చేసిన ప్రకటన మేరకు పది మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. ఎప్పుడూ భక్తులతో కిట కిట లాడే రాహుకేతుదోష నివారణ పూజా మండపాలు వెల వెల బోయాయి. అన్ని రకాల పూజలు కలుపుకొని కేవలం 1656 మాత్రమే జరిగాయి. ఇక రూ.50,200ల ప్రత్యేక దర్శన టిక్కెట్లును పరిశీలిస్తే 690 మాత్రమే జారి చేయబడ్డాయి. అయితే అభిషేకాలు 53, మహాన్యాసపూర్వ అభిషేకాలు 28 శనీశ్వరాభిషేకాలు 2 గురుదక్షిణామూర్తి అభిషేకాలు 135 జరిగినట్లు పేర్కొన్నారు. దాంతో ప్రదాన వీధి అయిన తేరువీధిలో కొన్ని హోటళ్ల బంద్ అయ్యాయి.

## సిఎం, ఎంఎల్ఏ చిత్రపటాలకు పాలాభిషేకం

శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి పట్టణంలోని 34,35 వార్డుల సచివాలయాల పరిధిలోని శ్రీరామనగర్ కాలనీలోని సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాలను కమిషనర్ ఉమామహేశ్వరరావు సారధ్యంలో సచివాలయాల ఇన్‌చార్జి మల్లికార్జున్ గౌడ్ సారధ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారంజకంగా పరిపాలిస్తున్న శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం జరిపారు. ఈ సందర్బంగా 11 రకాల సర్టిఫికేట్లను అందించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటి మాజీ అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, అర్కాడ్ శంకర్, కన్వీనర్ వి.నాగేందర్‌రెడ్డి, టి.గిరిప్రసాద్, టి.కవితల సారధ్యంలో నిర్వహించారు. వైకాపా నాయకులు సాధన మునస్వామి, పార్థ సారధి గౌడ్, మద్దు గోపాల్‌యాదవ్, శ్రీనివాసరెడ్డి, సూరిగౌడ్, కిషోర్‌గౌడ్ మున్సిపల్ అధికారులు డిఇఇ లలిత, బాలచంద్రయాదవ్, రవికాంత్, శ్రీనివాసులు మధు సూధన, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

## రీహాబిలిటేషన్ సెంటర్‌లో పుట్టినరోజు వేడుకలు

శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త :



పట్టణంలోని ఆర్టీసి బస్టాండు సమీపంలో ఉన్న బ్రైట్ కేర్ రిహాబిలిటేషన్ కేంద్రంలో యువరాజ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే కార్యక్రమాలను నిర్వహించి చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపు తామనినిర్వాహకులుస్పీచ్‌థెరఫిస్ట్ చార్లెస్(సూర్య) తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యా ర్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్‌లపై పంచాయతీ కార్యదర్శుల దృష్టి

తొట్టంబేడు, జూలై 27 ప్రభాతవార్త :



మండలంలోని పొయ్య పంచాయతీ రెవెన్యూలోని సర్వేనంబర్ 63/02ఎ, 02బి మరియు 63/02సి సర్వేనంబర్లులో పొయ్యకొత్తూరు గ్రామానికి చెందిన రోడ్డు తిరుపతి- నాయుడుపేట రోడ్డు పక్కన పొయ్య గ్రామపొలానికి 2.70 ఎకరాలు భూమిలో చేపట్టిన అనధికార లేఅవుట్‌ను తొలగించి అందులో ఎంపిడిఓ సురేష్‌బాబు ఆదేశాల మేరకు లేఅవుట్‌భూమిలో బోర్డులు ఏర్పాటుచేసినట్లు ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెంచయ్య తెలిపారు. ఈసందర్భంగా ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయభూమి, బంజరభూమిని నివాస స్థలాలుగా మార్చుకొనుటకు గ్రామపంచాయతీ అనుమతి తీసుకోకుంటా, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, పట్టణాభివృద్ది సంస్థ అనుమతి, సాంకేతిక అనుమతి పొందకుండగా ముందస్తు ప్లానులు సమర్పించి సంబందిత సంస్థలకు నిర్ణీత రుసుము చెల్లించకనే, తగిన ఉత్తర్వులు పొందకనే అనధికార లేఅవుట్‌లు వేసి ఉన్నారని, ఈవిధంగా చేయడం జివో నంబర్ 10, తేదీ 8.01.2020 ప్రకారం చట్టవిరుద్దమన్నారు. అనధికారిక లేఅవుట్‌లకు ఇక పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త :



ఊరందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో చెవుడు, మూగ, అంధత్వం, బుద్దిమాంద్యం మొదలైన విషయాలను పరీక్షించారు. అలాగే రక్తపరీక్షలు, జ్వరపరీక్షలు నిర్వహించారు. విద్యార్థినుల్లో కొంతమేరకు రక్తహీనతను గమనించి వారికి వారానికి మూడు రోజులు ఐరన్ పోలిక్ మాత్రలను పంపిణీచేసి ఆరోగ్య సూత్రాలు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలలో ఇస్తున్న రాగిజావ, చిక్కీలు రక్తవృద్దికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారిణి ప్రవీణ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ వనజాక్షి, ఆశావర్కర్లు ఉదయమ్మ, తులసమ్మ, రోజా మరియు ఉపాధ్యాయులు సురేష్, శాంతి, రజియా, మురళీ, రమేష్‌బాబు, మల్లికార్జున, సుమతి మరియు ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ ఓఆర్ఐ నిర్వహణ భేష్

తిరుపతి (క్రీడా), జూలై 27, ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ప్రాచ్య పరిశోధన సంస్థకు ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె. రాజా రెడ్డితో కలసి తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాధికారి డా. భాస్కర్ రెడ్డి పరిశీలించాఉ. ఓఆర్ఐ సంచాలకులు డా. పిసి వెంకటేశ్వర్లు వారికి సంస్థ ప్రాధాన్యతను వివరించారు. విసి మాట్లాడుతూ ప్రాచ్య పరిశోదన సంస్థ ఎస్వీయూలో విశిష్టమైనదని 1956 నుండి ఇక్కడి తాళపత్రాలను పనిబిడ్డల్లా సంరక్షిస్తూ, పరిశోధనలు చేస్తున్నారని, శాసన మండలి కమిటి, న్యాక్ కమిటీ సంస్థను చూసి సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌గా మెచ్చుకున్నారన్నారు. తితిదే విద్యాధికారి ఓఆర్ఐ నిర్వహణ చూసి ఆశ్చర్యపోయారు. ఎన్నో అపురూపమైన తాళపత్రాల సంరక్షణకు తీసుకుంటున్న శాస్త్రీయ పద్ధతులను చూసి మెచ్చుకున్నారు. డిజిటలైజేషన్ విధానంలో ఉపయోగిస్తున్న స్కానర్లను పరిశీలించారు. ఎంతో విలువైన గ్రంథాలయాలున్నాయని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓఆర్ఐ సిబ్బంది డా. వెంకటేష్, డా. రాజశేఖర్, డా. విజయకుమార్ రెడ్డి, చంద్రశేఖర్, సిద్ధయ్య, భాషా, నాగరాజు, రమేష్ రెడ్డి, విశ్వనాధ్ రెడ్డి, పరిశోధకులు యోగేశ్వర రావు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో జెండర్ సైన్సిటైజేషన్ కార్యక్రమం

తిరుపతి విద్య, జూలై 27, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థినులకు జెండర్ సెన్సిటైజేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జెండర్ సెన్సిటైజేషన్ అనేది ఇతరులతో వ్యవహరించడం ద్వారా జీవితంలో జెండర్ పాత్ర ఎలా పోషిస్తుందో తెలియజేసే ప్రక్రియ అని, భారతీయ ఆలోచన ప్రక్రియలో లింగం పెద్ద పాత్ర పోషిస్తుందని వయసుతో సంబంధం లేకుండా అందర్ని సమాన గౌరవంతో చూడడం పై ఆధారపడి ఉంటుందని,వ ఆటిపై సమగ్ర అవగాహన తెలుసుకోవడమే ఈ అవగాహన కార్యక్రమం ప్రత్యేకత అని తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జండర్ సెన్సిటైజేషన్ విభాగం అధ్యాపకులు డాక్టర్ రాణి, డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ అమ్మాయిలకు భద్రత గురించి జాగ్రత్తలు ఎలా పాటించాలో ముఖ్యంగా ర్యాంగింగ్ చీటింగ్ వీటి నుంచి ఎలా నిర్భయంగా ఎదుర్కొవాలో, అమ్మాయిల ఆత్మ రక్షణ కోసం కరాటి నేర్చుకోవడంతో పాటు బయటికి వెళ్లేటప్పుడు భారతీయ సంస్కృతి ప్రకారం దుస్తులు ధరించాలని వారి వారి ఫోన్లో దిశా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని వారి సంరక్షణ కోసం పోలీస్ శాఖ వారి నంబర్లను తెలుసుకుని ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇంచార్జి డా. స్నేహలత, స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు డా. జయమ్మ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## మదన్న వెంటే మేమంతా!

రేణిగుంట, జూలై 27 ప్రభాతవార్త:



రాత్రి, పగలు తేడా లేకుండా ఎల్లవేళల ప్రజాసేవ చేస్తున్న మదన్న వెంటే మేముంటామని సూరప్పకసం పంచాయతీ అల్లికేశం గ్రామ ప్రజలు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి గురువారం అపూర్వ స్వాగతం పలికారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఇంటింటికి తిరిగారు. మహిళలు మంగళ హారతులతో ఎదురేగి నీరాజనాలు సమర్పించారు. ఎమ్మెల్యే ప్రజలతో మమేకమై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. వృద్ధులకు, వితంతవులకు, వికలాంగులకు, పింఛన్లు సక్రమంగా అందుతున్నాయో లేదో ఆరా తీశారు. అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థుల సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే అధికారులను తక్షణం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఎమ్మెల్యేతో పాటు గడప గడపకు తిరిగిన వారిలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్, సూరప్పకశం సర్పంచ్ సుధ, రేణిగుంట సర్పంచ్ నాగేషం, విప్పమాను పట్టెడ సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి, రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, వైసీపీ సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, అత్తూరు మాజీ సర్పంచ్ హరి యాదవ్, ఎస్సీ నాయకురాలు అరుణాదేవి, వైసీపీ నేతలు శివారెడ్డి, గురవరాజుపల్లి చిన్నబాబు(బాబు సాహెబ్), మండలంలోని వివిధశాఖల అధికారులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెలిచిన ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తాం : రిషితరెడ్డి

రేణిగుంట, జూలై 27 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే ఆరు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితరెడ్డి అన్నారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చెంగారెడ్డిపల్లె, గొల్లపల్లి, దొడ్లమిట్ట గ్రామాల్లో గురువారం రిషితరెడ్డితో కలసి మండల టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో బొజ్జల కుటుంబాన్ని ఆదరించి, టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని రిషితరెడ్డి ప్రజలను కోరారు. ఇంటింటా ప్రచారం చేసిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, టీడీపీ మాజీ అధ్యక్షుడు జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు చిన్నారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు మునస్వామినాయుడు, బుజ్జినాయుడు, నగరి మునయ్య, అడ్వకేట్ ఉదయకుమార్‌రెడ్డి, కె.వి.చలం, నెల్లూరు సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

## వేరుశనగ పంటపై రైతులకు అవగాహన

ఎర్రావారిపాళెం, జూలై 26ప్రభాతవార్త:



ఖరీఫ్, రబీ సీజన్‌లో వేరుశనగ పండించే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట అధిక దిగుబడి రావడానికి అనుసరించాల్సిన విధానంపై బుధవారం ఎర్రావారిపాళెం మండలం బోడిపాటివారిపల్లి పంచాయతిలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి, వేరుశనగ కార్యక్రమం జరిగింది. ఒక చదరపుకిలోమీటరు విస్తీర్ణంలో విత్తనం మొలకెత్తిన తరువాత మొక్కలు ఎన్ని ఉండాలో లెక్కించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో అయితే చదరపు కిలోమీటరుకు 33మొక్కలు, రబీలో 44 మొక్కలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇలా పంటవేసుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయఅధికారిని తెలిపారు . రైతులు ఈ సూచనలు పాటించి వేరుశనగ దిగుబడి సాధించుకోవాలన్నారు.

## మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను వేగవంతం చేయండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జూలై 27 ప్రభాతవార్త :



తిరుపతి నగరం అభివృద్ధిలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ హరిత సూచించారు. గురువారం తిమ్మినాయుడు పాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డును కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ కరకంబాడి రోడ్డు తిమ్మినాయుడు పాలెం రోడ్డు బృందావనం మీదుగా రేణిగుంట కాటన్‌మిల్లు, రైల్వే గేటు వద్ద తిరుపతి, రేణిగుంట రోడ్డును కలిపేలా తీసుకొస్తున్న ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డు వలన ఇటు స్దానికులు అటు తిరుమలకి వచ్చే యాత్రికులకు ఎంతో ప్రయోజనంగా వుంటుందన్నారు. కరకంబాడి రోడ్డు వైపు నుండి రేణిగుంట రోడ్డు వైపు ఒకటిన్నర కిలో మీటర్ల వెడల్పు సుమారు పది కోట్ల రూపాయిల అంచనాలతో రూపుదిద్దుకుంటున్న ఈ రహదారి మాస్టర్ ప్లాన్ రోడ్లలలో మరో మణిహారంలా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటవ డివిజన్ కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, డిఈ విజయకుమార్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ దేవానంద్, ప్లానింగ్, అమ్నెటి సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాకు సహకరించండి

సత్యవేడు, జూలై 27 ప్రభాతవార్త:



తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని తహసిల్దార్ షేక్ జరీనా కోరారు. గురువారం తహసిత్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్ళి ఓటర్ల జాబితాను పరిశీలించడం జరుగుతోంది. ఇందులో భాగంగా డోర్ నెంబర్లు, చేర్పులు, తీసివేతలు, పేర్ల మార్పులు, వయసు, ఫోటోలు మార్చేందుకు మార్పులు చేపడుతున్నారు. ఈకార్యక్రమంలో వైసిపి మండలం కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, బిజెపి మండల అధ్యక్ష్యుడు జిఎం ప్రతాప్, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, టీడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఓటర్లు తప్పిపోకుండా చూడాలి : పార్టీ బలోపేతానికి పనిచేద్దాం

తిరుపతి, జూలై 27ప్రభాతవార్త:



ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన వారందరినీ ఓటరుగా చేర్పించాలని, అర్హులు తప్పిపోకుండా చూడాలని తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి సుగుణమ్మ సూచించారు. గురువారం సాయంత్రం ఎంఆర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ, మహేశ్‌యాదవ్, పార్టీ నాయకులతో కలసి సుగుణమ్మ ఓటరు పరిశీలన, నూతనంగా నమోదు, పార్టీ బలోపేతం పై చర్చించారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం

శ్రీకాళహస్తిరూరల్, జూలై 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనాన్ని పోలీసులు ప్రణాళిక ప్రకారం మాటువేసి పట్టుకున్నట్లు సిఐ అజయ్‌కుమార్ తెలిపారు. ఆయన అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రహస్య సమాచారం మేరకు మండలంలోని మేలచ్చూరు సమీపంలో కాపుకాయగా మేలచ్చూరు అడవుల నుంచి అక్రమంగా ఎర్రచందనాన్ని తరలిస్తున్న వారిలో ముగ్గురుని అదుపులో తీసుకోగా ఇద్దరు పరారి అయ్యారని వివరించారు. వారి నుంచి నాలుగు దుంగలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. అదుపులో తీసుకున్న వారిలో గంగాధరం.పి(40), వై వెంకటయ్య(55), ఎం చినబాబు (30)లను అరెస్టు చేయగా మేకల వెంకటయ్య, కొండా శ్రీనివాసులు పరారైనట్లు తమకు సమాచారం అందిందన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

## నిరుపేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త :



పట్టణంలోని కొండమిట్టలో నివాసం ఉంటూ మృతిచెందిన పురంధర్మయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక బేరివారి మండపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శరవణకుమార్ విచ్చేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శరవణకుమార్ మాట్లాడుతూ అందరికీ సుపరిచితుడుగా ఉంటూన్న పురంధర్మయ్య మృతి తీరనిలోటన్నారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీమయ్య, అర్జున, వెంకటేష్, మునిరెడ్డి, రాజశేఖర్, ధనమ్మ, అమ్ములు, దేవి, రాజేష్, భాస్కర్, మెకానిక్‌రెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులుగా పురుషోత్తంరెడ్డి

నారాయణవనం, జూలై 27 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా ఎఐటియుసి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా నారాయణవనం మండలం తిరు వట్యం గ్రామానికి చెందిన ఎస్ పురుషోత్తంరెడ్డిని ఏకాగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లా సహాయ కార్యదర్శి సిద్దంశెట్టి చంద్రబాబు తెలిపారు. ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా నిమితులు కావడం పట్ల పలువురు యూనియన్ సభ్యులు, ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

## మహిళలు అదృశ్యంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి!

వడమాలపేట, జూలై 27 ప్రభాతవార్త:



మహిళల అదృశ్యంపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి యాళ్ళ లక్ష్మీప్రసన్న డిమాండ్ చేశారు. గురువారం వడమాలపేటలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి 2021 మధ్య కాలంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7,918 మంది బాలికలు 22,278 మంది మహిళలు అంటే దాదాపుగా 30 వేల మంది అదృశ్యం అయినట్లు కేంద్ర హోమ్ శాఖ వెల్లడించిన గుణాంకాలను చూస్తుంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అనే సందేహం కలుగుతోందన్నారు. మహిళా పక్షపాతి అని సొంత డబ్బా కొట్టుకునే ముఖ్యమంత్రి ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పులివెందుల పులి, సింహం అంటూ జగన్మోహన్‌రెడ్డిని పొగడతలతో ముంచెత్తే మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మహిళా సాధికారత గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రాష్ట్రానికి ఒక మహిళ హోంమంత్రిగా పని చేస్తున్నా మహిళలపై జరుగుతున్న అన్యాయాలు అక్రమాలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని నిలదీశారు.

## బీజేపీ అధ్యక్షురాలిని కలసిన సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

విజయపురం, జూలై 27 ప్రభాతవార్త:



రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన దగ్గుబాటి పురందేశ్వరి జిల్లా పంచాయతీరాజ్ స్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయయాదవ్ గురువారం విజయవాడలో కలసి ఆమెకు పుష్పగుచ్చం అందించి శాలువతో సత్కరించారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదగడం ఆనందంగా ఉందన్నారు. మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలన్నారు.

## కిసాన్ మోర్చా రైతులకు వరం

– జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్

విజయపురం, జూలై 27 ప్రభాతవార్త:



కిసాన్ మోర్చా రైతులకు వరం లాంటిదని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన విజయపురంలో కిసాన్ మోర్చా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు 10 శాతం రాయితీతో సబ్సిడీ ఎరువులు, మందులు, విత్తనాలు సరఫరా చేస్తుందని, ప్రతి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, గోపి, జలజాక్షి, యుగంధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 30న అఖిల భారత యాదవ ప్రథమ మహాసభ

తిరుపతి కార్పొరేటర్, జులై 27 ప్రభాతవార్త :



అఖిల భారత యాదవ మహా సంఘం ఆద్వర్యంలో తిరుపతి జిల్లా ప్రథమ మహా సభను తిరుమల బైపాస్ రోడ్డు తిరుపతి టిఎంఆర్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు పిలుపు నిచ్చారు. గురువారం మహా సభలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేసారు. ఈ మహా సభలో తిరుపతి జిల్లా 7 నియోజకవర్గాలలో కలిపి 2 లక్షల పై చిలుకు యాదవులు వున్నారని వీరనందరినీ సమీకరించి చైతన్యం చేయడమే అఖిల భారత యాదవ మహాసంఘం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బుసగాని లక్ష్మయ్య, కరవాటి వెంకటముని సుబ్బయ్య, కొమ్మందల ధనంజయ, వెంకటసుబ్బయ్య, వెంకటేష్, కిషోర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు అంధకారమే

చంద్రగిరి, జూలై 27 ప్రభాతవార్త:




విద్యార్థి దశలో వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు అంధకారమేనని ఎస్ఈబి సిఐ లీలారాణి తేల్చిచెప్పారు. చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం మదద్రవ్యాల వినియోగం, అనర్థాలు, దిశా యాప్ ఉపయోగం, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి, ఆధునికపోకడలతో గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తుపదార్థాలు సేవించడం వలన జీవితం అస్తవ్యస్థం కాగలదని హెచ్చరించారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడం నేరమన్నారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్య పట్ల మాత్రమే దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు అత్యాశలకు పోయిసైబర్ మోసాలకు గురికావద్దన్నారు. ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు నిర్వహించే ముందు వెబ్‌సైట్స్‌పై అవగాహన కలిగివుండా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబి ఎస్ఐ చైతన్య, ఏఎస్ఐ రోహిణితిరుపతి సెట్విన్ మేనేజర్ కె.మోహన్‌కుమార్, విభాగాధిపతులు డాక్టర్ పి.నాగేంద్ర, డాక్టర్ పి.భక్తవత్సలం, డాక్టర్ టి.నరశింహారెడ్డి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫఅఈసర్ ఎస్.సుబాష్‌చంద్రబోస్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పేదలకు వరం: మోహిత్ రెడ్డి

చంద్రగిరి, జూలై 27 ప్రభాతవార్త:



ప్రతిష్టాత్మక జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరమని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గంగుడుపల్లి, మిట్టపాళ్యం పంచాయతీలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత మన సిఎంకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్ర కుమార్ రెడ్డి, ఎంపిడిఓ రమేష్‌బాబు, ఈఓఆర్‌డి శశిరేఖ, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, డిప్యూటీ తహశీల్దార్ అమృత, సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, బి.ధర్మారెడ్డి, ఏరియా ఆసుపత్రి కమిటీ సభ్యురాలు బోడ్రెడ్డి అచ్యుత విజయ్‌కుమార్ రెడ్డి, మండల కోఅప్షన్ సభ్యుడు ఔరంగజేబు, ఎంపిటిసి విమలమ్మ, వేణుగోపాల్ రెడ్డి, పసల నాగరాజ, వైసిపి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు సూరి, తదితరులు పాల్గొన్నారు.

## అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు: మోహిత్ రెడ్డి

రామచంద్రాపురం, జూలై 27 ప్రభాతవార్త:



అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలని వైసిపి ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. గురువారం మిట్టకండ్రిగలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు వివిధ రకాల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయించి సంక్షేమ పథకాలు అఈందించడం జరుగుతేందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఉట్టూ ప్రజలు తిరిగే అవకాశం కల్పించకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి సేవలందించే విధంగా మన ముఖ్యమంత్రి పరిపాలన సాగిస్తున్నట్లు కొనియాడారు. ఎంఎ్పఏ చెవిరెడ్డా భాస్కర్ రెడ్డి బాటలో తానూ నడచి ప్రజలకు అందుబాటువుండి సేవ చేసతమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి,. జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ రఘునాథ రెడ్డి, తహశీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ మహ్మద్‌రఫీ, డివిజినల్ కన్వీర్ చిట్టిబాబు, వైసిపి నాయకులు రమేష్ రెడ్డి, భూపతి రెడ్డి, మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి..!

–పశుసంవర్ధకశాఖ ఏడి చంద్రశేఖర్ రెడ్డి

రామచంద్రాపురం, జూలై 27 ప్రభాతవార్త:



రైతులు పశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చంద్రగిరి పశువైద్యశాఖ ఏడి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం నూతుగుంట పల్లి మహాభారత ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ గోవర్దన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు సాధారణ, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నట్టల నివారణకు మందులు పిచికారి చేయాలన్నారు. ఈ వైద్య శిబిరానికి పరిసర గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 200 పశువులకు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో కుప్పం బాదూరు పశు వైద్యాధికారి డాక్టర్ హేమకుమార్, డాక్టర్ కిరణ్, వైసిపి నాయకులు శంకర్ రెడ్డి, మునికృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **NAGENDRAN SIDDAGATTU** S/o Lakshmi Narasimhaiah Siddagattu, R/at 12-6-7/ B, Prasanthi Nagar, Tiruchanoor, Tirupati Rural (M), Tirupati Dist.A.P., herewith declare that I have changed my spouse name from **PUSHPALATHA KOTHAKOTA** (old Name) to **PUSHPALATHA SIDDAGATTU** (New Name) for furture all purpose.

# సమస్యలపరిష్కారం కోసమే 'మిషన్‌రాయలసీమ' : బొజ్జల

**శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త :**
రాయలసీమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి సీమను అభివృద్ధి బాట పట్టించేందుకు హామీ ఇస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా విడుదల చేసిన ప్రణాళికే మిషన్ రాయలసీమ అని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో స్థానిక పెండ్లిమండపం నుంచి ప్రారంభమైన మిషన్ రాయలసీమ అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీచేస్తూ నాలుగుమాడావీధుల్లో ఉన్న దుకాణదారులకు, ప్రజలకువివరించారు. మిషన్ రాయలసీమలో భాగంగా ఉమ్మడి కర్నూలు అభివృద్ధికోసం ప్రణాళికలు, వ్యవసాయ పరికరాల తయారీహబ్‌గా కర్నూలును అభివృద్ధి చేయడం,



బెంగుళూరు హైదరాబాదు ఇండ్రస్ట్రియల్ కారిడార్లో కర్నూలుకు కేంద్రబిందువు, వ్యవసాయ పరిశోభనల కేంద్రంగా కర్నూలు అభివృద్ధి, ఉమ్మడి కడప అభివృద్ధికోసం జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చి దిద్దే స్పోర్ట్ హబ్, జోనల్ ప్లానింగ్‌తో ఉపాధి కేంద్రాల అభివృద్ధి, యువత వలసలకు చెక్‌చెప్పి ఉపాధికి గమ్యంగా రాయలసీమను మారుస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా ఉమ్మడి చిత్తూరుకు ప్రాధాన్యత, ఆటోమొబైల్ హబ్‌గా అనంతపురంను మార్చుతారన్నారు. అన్నదాతల ఆదాయం రెండింతలు చేస్తామని నీరు ప్రతి ఒక్కరి హక్కు అని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ప్రతి ఒక్కరికి సురక్షిత తాగునీరు అందించడమే తెలుగుదేశంపార్టీ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్,చెంచయ్యనాయుడు, షాకిరాలీ, మిన్నల్‌రవి, నియోజవకర్గ బిసి నాయకుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం, తెదేపా ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, బాలాజీరెడ్డి, పలువురునాయకులు పాల్గొన్నారు.

## వరిలో మొలకలు రాకుండా...ఉప్పుద్రావణం స్ప్రే చేయండి

-వ్యవసాయశాఖ ఎడిఎ భాస్కరయ్య

**తిరుపతి,జులై 27ప్రభాతవార్త:**



జిల్లాలో గత మూడురోజులుగా కురుస్తున్న ముసురు వానతో కోతకు సిద్దమవుతున్న వరిపంట వాలిపోతూ,గింజలు మొలకెత్తుతున్నట్లు గుర్తించడం జరిగిందని వ్యవసాయశాఖ జిల్లా వనరులకేంద్రం ఎడిఎ మెరుగు భాస్కరయ్య తెలిపారు. కెఎన్ఎం 1638 కునాలు రకం వాలిన పైరులో,వాలని పైరులో దీన్ని గుర్తించామని, దీని నివారణకు రైతులు మొదట పొలాల్లో నీరు నిల్వఉండకుండా, గట్టుకొట్టి పోలంలో నీరునుయ పూర్తిగా లేకుండా తీసివేయాలి. తరువాత వెన్నులు బాగా తడిసేలా 2-3శాతం ఉప్పుద్రావణాన్ని లీటరు నీటికి 20-30గ్రాములు ఉప్పు కలిపి స్ప్రే చేసుకుంటే సమస్య ఉధృతి తగ్గుతుందన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు : మేయర్ శిరీష

**తిరుపతి కార్పొరేషన్, జులై 27 ప్రభాతవార్త :**



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ధ్యేయమని మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం తిరుపతి నగరంలో 12,13 డివిజన్లకి కెనడినగర్, ఆరవ డివిజన్ కొత్తపల్లి, 45వ డివిజన్ శివజ్యోతినగర్‌లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టికెట్లను అందజేసారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏమేమి హామీలిచ్చారో వాటిలో 98 శాతం పైగా నెరవేర్చారని కొనియాడారు. ఈ నాలుగేళ్ళలో అక్క చెల్లెమ్మల అకౌంట్లలోకి ఆసరా, విద్యా దీవెన, అమ్మఒడి, కాపునేస్తం ఇలా అన్ని పథకాల ద్వారా ప్రజలకి అందించిన మొత్తం 3 లక్షల 39 వేల కోట్ల రూపాయిలున్నాయన్నారు. తిరుపతి నగరంలో అర్హులైన 26,500 మందికి ఇంటి పట్టాలు ఇచ్చి, ఇళ్ళు నిర్మిస్తూ పేదవాళ్ళ పక్షంగా నిలబడి పనిచేస్తున్న జగన్ మోహన్ రెడ్డికి మనమంతా తోడుగా నిలబడాలని ప్రజలను విజ్ఞప్తి చేసారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలు వారికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు అన్ని ఉచితంగా అందుకున్నారని ఈ కార్యక్రమం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె బాబు, కార్పొరేటర్లు కోటురు ఆంజినేయులు, కేతం జానకి, అనీష్ రాయల్, కార్పొరేటర్లు పుల్లూరు అమర్నాథ రెడ్డి, అదనపు కమిషనర్ సునీత, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, జేసిఎస్ నాయకులు బాలిశెట్టి కిశోర్, ఉదయగిరి రమేష్, దొడ్డారెడ్డి మురళి, నాయకులు తాళ్ళూరి ప్రసాద్, రాపూరి ప్రసాద్, నల్లానీ బాబు, శ్యామల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే టిడిపి అజెండా

-టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి

**చంద్రగిరి, జులై 27 ప్రభాతవార్త:**



ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తెలుగుదేశం పార్టీ అజెండా అని టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. స్థానిక టవర్ క్లాక్ సమీపంలోని టిడిపి పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఆమె మహానాడు మ్యానిఫెస్టో ప్రచారానికి మహాశక్తి ప్రచార రథంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ మ్యానిఫెస్టో అమలు చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందగలవన్నారు. నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పిస్తూ మ్యానిఫెస్టోను ప్రకటించినట్లు తెలిపారు. అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు టిడిపి మ్యానిఫెస్టోను వివరించాలన్నారు. అమ్మకు వందనం పేరిట ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే ఒక్కొక్కరికి రూ.15 వేలు తల్లి ఖాతాలో, 18 నుండి 59 ఏళ్ళ వరకు రూ.1500/-లు మహిళల వ్యక్తిగత ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు.ప్రతిఇంటికిమంచినీటికుళాయిద్వారాసురక్షితమంచినీటిని అందిస్తామన్నారు. అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నారు. బిసిల రక్షణకై ప్రత్యేక చట్టం తీసుకువస్తామన్నారు. పార్టీలోని మహిళా విభాగం పూర్తి స్థాయిలో పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం, పులివర్తి నానిని ఎంఎల్ఏగా గెలిపించుకోవడం మనందరి బాధ్యతగా గుర్తెరగాలన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించంటూ ఆందోళన

**శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త :**



విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శ్రీకాళహస్తి-చెన్నై రోడ్డు వద్ద ఉన్న విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద భోజన విరామసమయంలో నల్లబ్యాడ్జీలు ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా తిరుపతి జెఎసి ఛైర్మన్ మునస్వామి విచ్చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్, కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డైరెక్ట్ పేమెంట్ మరియు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1.2.1999 నుంచి 31.8.2004 మద్య నియామకం అయిన ఉద్యోగులకు ఈపిఎఫ్ నుంచి జిపిఎఫ్‌కు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అమలుచేయాలన్నారు. జెఎల్ఎం గ్రేడ్-2కు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అమలుచేయాలని జెఎల్ఎం గ్రేడ్ 2 ఉద్యోగులను క్రమబద్దీకరించి మరియు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలును అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేసి, పిఆర్‌సి-2022 వెంటనే అమలు చేయాలన్నారు. ఆగస్టు 10 వరకు దశలవారీగా తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమం తప్పదన్నారు. నిరసనలో డిఈఈలు సతీష్‌బాబు, ఎఈఈలు కృష్ణయ్య, కుమార్‌బాబు, పలువురు విద్యుత్ ఉద్యోగులు,లైన్‌మ్యాన్‌లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రాణదాన పథకం కింద 91 మంది పేద రోగులు ఎంపిక

**తిరుపతి టౌన్, జులై 27, ప్రభాతవార్త**
శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ ఆసుపత్రిలో టిటిడి జేఇఓ, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి సదాభార్గవి ఆధ్వర్యంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. 91 మంది పేద రోగులను ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. పేషంట్లుయొక్క ఆరోగ్య స్థితిగతులను, బియ్యం కార్డు కలిగి దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న నిరుపేదలను వారి అర్హతను బట్టి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడానికి వివిధ విభాగాల క్రింద ఎంపిక చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. కార్డియాలజి 01, కార్డియో థొరాసిక్ 04, ఎండోక్రైనాలజీ 1, జనరల్ సర్జరి 03, మెడిసిన్ 03, మెడికల్ ఆంకాలజీ 03, నెప్రాలజీ 16, న్యూరాలజీ 12, న్యూరో సర్జరీ 16, గైనకాలజీ 1, రేడియాలజి 01, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజి 14, రేడియేషన్ అంకాలజి 09, సర్జికల్ ఆంకాలజి 06, యురాలజి 01, మొత్తం 91 మంది పేదరోగులను ఉచిత శస్త్రచికిత్సలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాణదాన కమిటీ సభ్యులు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, ఆర్ఎంఓ డా. కోటిరెడ్డి, ఎస్. రవిప్రసాద్, అడిషనల్ ఎఫ్ఎఎస్‌సిఎఓ టిటిడి డా. మురళీధర్ రావు, సిఎంఓ టిటిడి డా. కిషోర్, ఆర్ఎంఓ బర్డ్ హాస్పిటల్, డా. ఐబి దేవి, స్విమ్స్ వివిధ విభాగాధిపతులు, డాక్టర్లు పాల్గొన్నారు.

## వైభవంగా పిడికిలి గంగమ్మ పుష్కర కుంభాభిషేకం

**పుత్తూరురూరల్, జూలై 27 ప్రభాతవార్త:**
పుత్తూరు పట్టణంలోని బజారు వీధిలో వెలసిన పిడికిలి గంగమ్మతల్లి(ఇరుకళ గంగమ్మతల్లి) పుష్కర కుంభాభిషేకం భక్తి ప్రవర్తలతో గురువారం ప్రారంభించారు. ఈ కుంభాభిషేకం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గంగజాతర కమిటీ వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు. కూడలిలో అమ్మవారి ప్లెక్సీ బోర్డులను ఏర్పాటుచేశారు. అనంతరం బెస్తవీధిలో వెలసిన నేడు శుక్రవారం ఉదయం 5 గంటలకు ప్రాత కాలార్చన దీక్ష హోమాలు దుర్గాదేవి శ్రీ సూక్త పురుష సూక్త సరస్వతి, సప్త దుర్గా గాయత్రి హోమం, నవగ్రహోమాలు జయాధి హోమం, పూర్ణాహుతి కుంబోద్వాసన అనంతరం 8 గంటలకు గోపూజ ఆలయ ప్రదర్శన త్రిశూలంకు మహా ద్వారంకు కుంభాభిషేకం, అలంకరణ అర్చన నైవేద్యం మంత్ర పుష్పం హారతి, తీర్థ ప్రసాదాలు వినియోగం యజమాన ఆశీర్వాదం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పల్లెలో క్లోరినేషన్‌కి నోచుకోని వాటర్ ట్యాంకులు..!

-పెరుగుతున్న వాంతులు, విరేచనాలు -పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు

**నారాయణవనం, జూలై 27 ప్రభాతవార్త :**



నారాయణవనం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్మించిన వాటర్‌ట్యాంకులను శుభ్రం చేసే భాద్యతను పంచాయతీ కార్యదర్శులు మరిచిపోయారు. అసలు పల్లెల్లో నిర్మించిన వాటర్‌ట్యాంకులను శుభ్రం చేస్తున్నరా?లేదా?అనే విషయాలను పర్యవేక్షించాల్సిన ఇఒపిఆర్‌డి కూడా పట్టించుకోవడం లేదు. మండలంలో మొత్తం 18 పంచాయతీలు వున్నాయి. 18 పంచాయతీల్లోను వాటర్ ట్యాంకులు వున్నాయి. వాటర్‌ట్యాంకులను ప్రతినెల క్లీనింగ్ చేయాల్సి వుంది. ట్యాంక్ క్లీనింగ్‌తో పాటు ట్యాంకు గోడలపై శుభ్రం చేసిన తేదిని కూడా ప్రచురించాల్సి వుంది. అయితే సక్రమంగా వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. దీంతో కొన్ని పంచాయతీల్లో మాత్రం మూడునెలలు ఒకసారి తూతూమంత్రంగా శుభ్రం చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రస్తుతం వర్షంకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు తాగే నీటి ద్వారా అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నది. ఇప్పటికే నారాయణవనంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రి పాలవుతున్నారు. కావున ప్రస్తుతం మండల స్థాయి అధికారులు స్పందించి ప్రతినెల వాటర్‌ట్యాంకును శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## శ్రీసిటీలో ఆర్చరీ అంతర్జాతీయ విజేతకు ఘన సన్మానం

**సత్యవేడు, జూలై 27,ప్రభాతవార్త:**



ప్రపంచ ఆర్చరీ పోటీల్లో అండర్ 18 గ్రూపు విభాగంలో సిల్వర్ మెడల్‌ను సాధించిన గణేష్ మణిరత్నం(17) ను గురువారం శ్రీసిటీలో ఘనంగా సన్మానించారు. నాయుడుపేటకు చెందిన హరిప్రసాద్,సుప్రియ దంపతుల కుమారుడు గణేష్ ఇటీవల ఐర్లాండ్‌లో జరిగిన ప్రపంచ పోటీల్లో మెడల్ సాధించాడు. ఈఘనతకు గుర్తింపుగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, గణేష్‌ను శ్రీసిటీకి పిలిపించి ఘనంగా సన్మానించారు. ఏపి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ రవిశంకర్, ఐపిఎస్, ఇతర పోలీసు అధికారుల సమక్షంలో రవీంద్ర సన్నారెడ్డి విలువిద్య విజేతను పుష్పగుచ్ఛము, శాలువాలతో సత్కరించి, రూ॥11,111/- నగదు బహుమతి అందజేశారు. అతి చిన్న వయసులో అరుదైన క్రీడ అర్చరీలో పలు పథకాలు సాధించిన గణేష్ క్రీడాసక్తిని శ్రీసిటీ ఎండీ ప్రశంసించారు. మరింత కృషిచేసి భవిష్యత్‌లో భారత్‌కు ఒలింఫిక్ మెడల్ తీసుకుని రావాలంటూ విద్యార్థికి ఆశీర్వచనములు అందించారు.

## కావేరీ విశ్రాంతి గృహం ప్రారంభం

**తిరుమల,జులై 27 ప్రభాతవార్తప్రతినిధి:**



పద్మావతి అతిథిగృహాల ప్రాంతంలో నూతనంంగా హైదరాబాద్‌కు చెందిన ఎల్ఎసి అధినేత భాస్కర్‌రావు పునర్నించిన కావేరీ విశ్రాంతి గృహాన్ని గురువారం ఉదయం టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి ప్రారంభించారు. ఇందులోని 12 గదులు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో వసతి కల్పన విభాగం డిప్యూటీ ఇఒ (ఆర్1) పి.హరీంద్రనాథ్ ,విజిఒ గిరిధర్, బాలిరెడ్డి పాల్గొన్నారు.

## తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నూతన కార్యవర్గ సమావేశం

**తిరుపతి కార్పొరేషన్, జులై 27, ప్రభాతవార్త**



తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నూతన కార్యవర్గ సమావేశం, ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి కార్యవర్గ సమావేశంలో మీడియా మిత్రులు కొత్తగా సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ప్రెస్ క్లబ్ తరపున మాధురి రెమెడీ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కార్యవర్గ సభ్యులు, బంధుమిత్రులు హాజరై ఈ కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ తరపున ప్రతి 3 నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మీడియా మిత్రులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నూతనంగా పదవులు పొందిన వారు వ్యవస్థాపకుడు తపసి మురళి రెడ్డి, గౌరవ అధ్యక్షులు రెడ్డి ప్రసాద్, ప్రెసిడెంట్ బి. రాజా రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగడపి వేణుగోపాల్ రెడ్డి, కిషోర్, శేషాద్రి, సెక్రెటరీ పద్మానాభం నాయుడు, జాయింట్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి, రంగయ్య, కోశాధికారి కె. రమేష్, సురేష్, పిఆర్ఓ అరుప్ప నాతన్, ప్రకాష్, మీడియా ఇంచార్జి కె. హేమాద్రి, కన్వీనర్ చక్రీ, లీగల్ అడ్వైసర్ రవి చంద్ర, ఇసి సభ్యులు ప్రమాణస్వీకారం చేసారు.

## వికలాంగుల సేవలో విర్కో ఫౌండేషన్

**శ్రీకాళహస్తి, జూలై 27 ప్రభాతవార్త :**
శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి నియోజకవర్గంలోని వందలాది మంది



వికలాంగులకు సహాయ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. గురువారం వైయస్‌ఆర్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్బంగా వందలాది మంది ప్రత్యేక ప్రతిభావంతులకు విర్కోఫౌండేషన్ సారధ్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రైసైకిళ్ళు,కృత్రిక కాళ్ళు, చేతులు, చెవిటి మిషన్లు, హ్యాండ్ స్టిక్‌ల పంపిణి కార్యక్రమాలను భారీ ఎత్తున ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు విచ్చేసిన వైవి సుబ్బారెడ్డి శ్రీకాళహస్తినియోజకవర్గంలో ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధనరెడ్డి, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఎలా అమలు జరుగుతున్నాయనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.వారి సమస్యలను అ డిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా అందుతుంది?అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులకు వెంటనే పథకాల ఫలాలలను అందించుటకు అధికారులుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్బంగా వికలాంగుల సేవలో తరించిన విర్కో ఫౌండేషన్ ప్రతినిధులను ఉచిత రీతిలో నాయకులు సత్కరించారు.వారికి శ్రీకాళహస్తీశ్వరుని చిత్రపటాలనుఅందించారు.ఈ కార్యక్రమాల్లో బియ్యపు పవిత్రారెడ్డి, లోకేష్‌యాదవ్, రత్నంరెడ్డి, చిట్టివేలుజయగోపాల్,పాలమంగళం రవి, యుగంధర్‌రెడ్డి, కోళ్లూరు హరినాయుడు, పసల సుమతి, రుషేంద్రమణి, ధనలక్ష్మీ, దీపిక, జయశ్రీ, పసల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

## వర్షానికి అన్నదాతలకు ఎలాంటి నష్టం లేదు

-వ్యవసాయశాఖ సహాయసంచాలకులు రమేష్‌రెడ్డి

**తొట్టంబేడు, జూలై 27 ప్రభాతవార్త :**



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది లేదని శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ సహాయసంచాలకులు రమేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, కెవిబిపురం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో అన్నదాతలు వేసిన పంటలు ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. డివిజన్ పరిధిలో వరి 6789హెక్టార్లు, వేరుశనగపంట 1268హెక్టార్లు, సజ్జ 889హెక్టార్లు, చెరకు 90హెక్టార్లలో సాగుచేస్తున్నారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షం మైట్(నల్లి) వరిపంటలో తెగులు పోవడానికి మంచిదని అభిప్రాయపడ్డారు. డివిజన్ పరిధిలో మొత్తం పంటలన్నీ కలిపి 9106హెక్టార్లలో అన్నదాతలు సాగుచేస్తున్నారన్నారు. అయితే కొందరు అన్నదాతలు వేసిన వేరుశనగ పంటను ఒబ్బిళ్ళు చేయగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దొమ్మరమిట్టకు చెందిన సుబ్రమణ్యం తనకున్న 6 ఎకరాల్లో సుమారు రూ.1.50లక్షలు పెట్టుబడిపెట్టి ట్యాగ్ 24 వేరుశనగ పంటను సాగుచేశారు. అయితే వేరుశనగక్కాయలు తడిసిపోవడంతో ఓగోదాములో ఆరబెట్టి వాటిని ప్యాన్లు ఏర్పాటుచేశారు. పంటనష్టపరిహారాలు అన్ని పంటసాగులో ఉన్నపుడు నష్టం వస్తే ఇస్తామని తెలిపారు. గురువారం పట్టణంలో వరుణుడు కరుణించడంతో వ్యాపారస్తులు, ప్రజలు, అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు.

## జగనన్న ప్రభుత్వంలో ఇంటింటికి ప్రభుత్వ పథకాలు

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట, జూలై 27 ప్రభాతవార్త :**



జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం నాయుడుపేట మండలం అన్నమేడు సచివాలయం పరిధిలోని మర్లపల్లి, అన్నమేడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాంతంలో గట్టి పట్టు ఉన్న వైసీపీ సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మర్లపల్లి గ్రామంలో మహిళలు బారులు తీరి ఎమ్మెల్యేకు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. గ్రామ యువత హుషారుగా సంజీవయ్య వెంట నడిచారు. నాయుడుపేట మండలంలోని తూర్పు ప్రాంత గ్రామాల్లో తిరుగులేని ప్రజాదరణ కలిగిన ప్రజా నేత కామిరెడ్డి రాజారెడ్డి ఈ ప్రాంతంలో తనకు తిరుగులేదని మరోసారి ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, మర్లపల్లి, అన్నమేడు, వేముగుంటపాలెం గ్రామ సర్పంచులు, పార్టీ నాయకులు జలదంకి ధనంజయరెడ్డి, ఎఎంసి డైరెక్టర్ కామిరెడ్డి రాజారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు డాలర్స్ వారి బర్త్‌డే బంపర్ ఆఫర్

**తిరుచానూరు, జులై 27 ప్రభాతవార్త :**



తిరుచానూరు ప్రముఖ రియల్ ఎస్టేట్ డాలర్స్ గ్రూపు అధినేత దివాకర్ రెడ్డి పుట్టిన రోజు, డాలర్స్ గ్రూపు సంస్థ 10వ వార్షికోత్స వం సందర్బంగా నేడు ఒక లీటర్ పెట్రోల్ పై 12 రూపాయిలు సబ్సీడీతో 100 రూపాయిలకు అందజేస్తున్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రజలపై విధిస్తున్న అధిక పెట్రోల్ భారాన్ని తగ్గించేందుకు సామాన్య ప్రజలకు ఒక్క రోజు తమ వంతు సాయంగా సేవ చేస్తున్నారు. ప్రభుత్వాలకు కూడా ఆలోచించేలా చేస్తున్నాడు. అదే ఆయన మన నాయకుడైతే మన కెంతో మేలు జరుగుతుందో ఆలోచించాలని అంటూ అభిమానులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతి చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఉదయం 7 నుంచి సాయంత్రం 7 వరకు తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం వద్ద కెజిఎన్ భారత్ పెట్రోల్ బంకు, తొండవాడ వద్ద వున్న శ్రీ లక్ష్మి ప్యూయల్స్ నాయారా పెట్రోల్ బంకు నందు ఆఫర్‌తో అందజేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు.

## భక్తుల సముదాయ వసతి ఏర్పాటుకు వినతి

**చిల్లకూరు, జులై 27 ప్రభాతవార్త :**



మండలంలోని కలవకొండ గ్రామంలో కొండపై వెలసివున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ప్రాంగాణంలో భక్తులు విశ్రాంతి కోసం తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల నుంచి వసతి సముదాయం ఏర్పాటు చేయాలని గురువారం లక్ష్మి నరసింహస్వామి ఆలయ చైర్మన్ కందల ఆనంద్ రావు, ఏఎంసి మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి ప్రదాత యరటపల్లి జానకిరామిరెడ్డితో పాటు వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డిలు టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని నెల్లూరులో ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నందు కలిసి వినతి పత్రం అందించడం జరిగింది. అదే విధంగా లక్ష్మి నరసింహ స్వామి చెంచులక్ష్మి ఆదిలక్ష్మి అమ్మవార్లను దర్శించుకోవాలని టిటిడి చైర్మన్‌ను ఆహ్వానించారు.

## సదస్సుకు కురుగొండ్ల ఆధ్వర్యంలో తరలిన బీసీలు

**వెంకటగిరి, జులై 27 ప్రభాతవార్త:**



ఒంగోలులో జరిగే బీసీల సదస్సు కార్యక్రమానికి వెంకటగిరి నియోజకవర్గం నుంచి రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బీసీ నాయకులు కలిసి బయలుదేరే వాహనాలకు మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌వర్యులు కురుగొండ్ల రామకృష్ణ జెండా ఊపి వాహనాలను పంపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ 2024లో టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. బీసీలందరూ టీడీపీ వైపే ఉన్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడుతారని తెలిపారు. ఎన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించిన వైసీపీ అధికారంలోకి రాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కె.వి.కె.ప్రసాద్‌నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## పిఇఎస్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

**కుప్పం, జూలై 27 ప్రభాతవార్త :**



పిఇఎస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో క్లిష్టమైన అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా॥ చెన్నబసవ పాటిల్ తెలిపారు. వి.కోట మండలం కుదవగడ్డకు చెందిన రమేష్ (31) ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరాడన్నారు. అతని ముఖం రెండు భాగాలుగా చీలిపోయి రక్తనాళాలు, కండరాలు దెబ్బతిన్నాయన్నారు. దీంతో అతన్ని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చేర్చి అత్యవసర ఆపరేషన్ నిర్వహించామన్నారు. వైద్యులు ప్రమోద్, దాక్షిణ్య, బషీర్, షఫీ ఉల్లా బృందం సుమారు ఐదుగంటలపాటు ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఈ చికిత్స ఉచితంగా చేశామన్నారు. ప్రస్తుతం రమేష్ కోలుకున్నాడని పేర్కొన్నారు. ఇలాంటి అరుదైనశస్త్రచికిత్సలనుతక్కువ ఖర్చుకే నిర్వహిస్తున్న వైద్యులను ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది.

## భక్తులకు మొబైల్ కంటైనర్ వసతి

-25 మందికి వీలుగా సదుపాయాలు



**తిరుమల,జులై 27 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు లక్షమందికిపైగా భక్తులు వస్తుండటంతో వసతి కోసం ఇక్కట్లు తప్పడం లేదు. ఈ నేపధ్యంలో టిటిడి వినూత్నంగా భక్తులకు వసతి కల్పించే యోచన చేసింది. ఇందుకోసం ఎయిర్‌కండిషన్‌తో 12 పడకలు, స్నానపుగదులు, మరుగుదొడ్ల సౌకర్యంతో విశాఖపట్నంకు చెందిన దాత మూర్తి సహకారంతో మొబైల్ కంటైనర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు.

